'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 17 | సోమవారం | 31.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 17 | Monday | 31.08.2026 | Pages: 8 | Rate: 2



## డీవీ మనోహర్ హిస్టరీ...

# అసామాన్య విక్టరీ

### చేనేత కుటుంబంలో చరిత్రకారుడు

**అందనంత ఎత్తుకెదిగిన అసామాన్యుడు**

**దేశం కోసం సైకిల్ తొక్కిన మనోహరుడు**

**వ్యాపారం నుంచి సామాజిక బాధ్యత వరకు**

**చిన్న పరిశ్రమ నుంచి జాతీయ విధానం వరకు**

**మూలాలను మరవని దేవాంగ ధీరుడు**

**విజయగర్వం తలకెక్కని చేతల విధేయుడు**

చేనేత కుటుంబం నుంచి వ్యాపార శిఖరాలకు.. అక్కడి నుంచి సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ వరకు సాగిన అసాధారణ ప్రస్థానం డీవీ మనోహర్‌ది. చేతిలో పెట్టుబడి లేదు.. కానీ ఏదో సాధించాలన్న సంకల్పం ఉంది. 1975లో రూ.72 వేలతో ప్రారంభమైన చిన్న కుటీర పరిశ్రమ.. డీప్‌వెల్ హ్యాండ్ పంపులు, శక్తి గ్యాస్, హాస్పిటాలిటీ రంగాల మీదుగా విస్తరించింది. వ్యాపారంలో విజయాలు సాధించినా.. విజయగర్వం తలకెక్కకుండా తన మూలాలను మరవని వ్యక్తిత్వం ఆయనది. దాదాపు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత సైకిల్ ఎక్కి.. లండన్-పారిస్ సవాల్‌ను పూర్తి చేసిన ఆయన, వ్యక్తిగత అభిరుచిని సామాజిక ఉద్యమంగా మలిచారు. హైదరాబాద్ బైసిక్లింగ్ క్లబ్‌ను బలమైన సైక్లింగ్ కమ్యూనిటీగా తీర్చిదిద్దారు. వరల్డ్ సైక్లింగ్ అలయన్స్‌లో ఆసియా నుంచి కీలక నాయకత్వ స్థానాన్ని అందుకున్నారు. స్మార్ట్‌బైక్ ద్వారా పబ్లిక్ బైక్ షేరింగ్‌ను దేశానికి పరిచయం చేసి, సైక్లింగ్‌ను ఆరోగ్యంతో పాటు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు ఆయుధంగా మార్చారు. ఇప్పుడు జాతీయ సైక్లింగ్ విధానానికి రూపకల్పన చేసే స్థాయికి ఎదిగారు. మరోవైపు కోవిడ్ సమయంలో పేదలకు అండగా నిలిచి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పిల్లల కోసం పీడియాట్రిక్ ఐసీయూలు, కంటి వైద్య సేవలకు సహకారం అందించారు. సంపదను సంపాదించడం కంటే.. సమాజానికి తిరిగి ఇవ్వడమే నిజమైన విజయమని తన చేతలతో చాటిన మనోహర్ జీవితం ఒక వ్యక్తి కథ కాదు.. ఒక స్ఫూర్తి చరిత్ర.

- వివరాలు 6,7లో...

# ఒక్క హెచ్చరిక

## 1,643 మంది ప్రాణాలు కాపాడాడు

**ఫోన్ కాల్‌తో మొదలైన అప్రమత్తత**

**టీచర్ ఆలోచనతో తప్పిన పెను విషాదం**

నేపాల్‌లోని నువాకోట్ జిల్లాలో సంభవించిన భయంకర వరదల్లో ఓ పాఠశాల ప్రిన్సిపాల్ చూపిన సమయస్ఫూర్తి 1,643 మంది విద్యార్థుల ప్రాణాలను కాపాడింది. త్రిశూలి వ్యాలీలోని త్రిభువన్ త్రిశూలి సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్, ఇంగ్లిష్ టీచర్ రాజేంద్ర దవాడి బుధవారం ఉదయం పాఠశాలలో ఉన్నారు. ఉదయం 9.20 గంటల సమయంలో ఓ స్నేహితుడు ఫోన్ చేసి సమీప గ్రామాన్ని నది వరద ముంచేసిందని, భారీగా నీరు పాఠశాల వైపు వస్తోందని హెచ్చరించాడు. - వివరాలు 3లో...



# వెయ్యి రోజుల్లో తెలంగాణకు కొత్త దిశ




## ప్రజాస్వామ్యం, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

### ప్రజల చేతుల్లోకి పాలన:మంత్రి ఉత్తమ్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం రాష్ట్ర రాజకీయ ప్రస్థానంలో కీలక మైలురాయని మంత్రి ఉత్తమ్ కుమా ర్ రెడ్డి అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ప్రభుత్వం మారడమే కాదు.. ప్రజాస్వామ్య స్ఫూర్తి పునరుద్ధ రించామని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చుట్టూ కేంద్రీకృతమైందని విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల గొంతుకకు ప్రాధాన్యం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పరిస్థితికి ముగింపు పలికిందని తెలిపారు. ప్రజా వాణి, గ్రామసభలు, ప్రత్యక్ష ప్రజా సంప్రదింపుల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చా మని వెల్లడించారు.

- వివరాలు 2లో...



# మన ఐక్యతే మన బలం

**ముస్లిం దేశాలకు మొజ్తబా ఖమేనీ పిలుపు**

**అమెరికా, ఇజ్రాయెల్ అసలు శత్రువులు**

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ముస్లిం దేశాల మధ్య ఐక్యతకు పిలుపునిచ్చారు. మధ్యప్రాచ్య యుద్ధం ప్రారంభమై ఆరు నెలలు పూర్తైన నేపథ్యంలో ఆదివారం ఆయన రాతపూర్వక సందేశం విడుదల చేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ప్రాంతీయ ముస్లిం దేశాలు ఒక్కటిగా నిలవాలని ఆయన కోరారు. ముస్లిం దేశాల సమస్యలకు పరిష్కారం పరస్పర స్నేహం, సహకారం, ఐక్యతలోనే ఉందని పేర్కొన్నారు. ముస్లింల మధ్య విభేదాలు, ఘర్షణలకు కారణమయ్యే చర్యలు తెలిసో తెలియకో శత్రువుల ప్రయోజనాలకు ఉపయోగపడతాయని హెచ్చరించారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన ఈ సందేశాన్ని ఇచ్చారు.

- వివరాలు 3లో...

# రైలు అభివృద్ధికి భారీగా నిధులు

- వివరాలు 2లో...

**వికారాబాద్ రైల్వేకు ఆధునిక రూపం**

**అలంపూర్‌లో ఆధ్యాత్మిక శోభ**

**పర్యాటకానికి కొత్త ఊపు: కిషన్‌రెడ్డి**

వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణ రైల్వే అభివృద్ధిపై కీలక వివరాలు వెల్లడించారు. రూ.27 కోట్లతో వికారాబాద్ స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని, రోజుకు సుమారు 15 వేల మంది ప్రయాణికులు, 60 రైళ్లు రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, వీఐపీ లాంజ్, పార్కింగ్ వంటి వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.



## ఇల్లు కొంటున్నారా? ఐతే ఇవి చూసుకోండి!

### ధర కంటే డీల్ ముఖ్యం

**చదరపు అడుగులు కాదు..**

**స్థలం, నాణ్యతే అసలు విలువ**

**స్క్వేర్‌ఫీట్ లెక్కతో మోసపోవద్దు**

హైదరాబాద్‌లో సొంత ఇల్లు కొనాలని చూస్తు న్నారా? అయితే బ్రోచర్‌లో కనిపించే చదరపు అడుగు ధర ఒక్కటే చూసి నిర్ణయం తీసుకోవద్దు. ఒకే ప్రాంత ంలో, దాదాపు ఒకే విస్తీర్ణం ఉన్న రెండు ఫ్లాట్ల ధరల్లో భారీ తేడా ఉండొచ్చు. దీనికి కారణం కేవలం బిల్డర్ బ్రాండ్ కాదు. లొకేషన్, నిర్మాణ నాణ్యత, ఫ్లాట్ ప్లాని ంగ్, గాలి వెలుతురు, ప్రైవసీ, పార్కింగ్, మెయిం టెనెన్స్, కనెక్టివిటీ వంటి అంశాలు అసలు విలువను నిర్ణయిస్తాయి. హైదరాబాద్‌లో ఐటీ కారిడార్ వైపు వెళ్లే కొద్దీ ధరలు పెరగడం సహజమే. అయితే ఎక్కువ ధర పెట్టినంత మాత్రాన మంచి ఇల్లు దొరుకుతుందని అనుకోవడం తప్పు. పెద్ద ఫ్లాట్ కంటే సరైన లొకేషన్‌లో బాగా ప్లాన్ చేసిన ఇల్లు ఎక్కువ విలువ ఇవ్వొచ్చు. లొకేషన్ విషయంలో ఆలోచన మారాలి

- వివరాలు 3లో...



# తెలంగాణలో పుష్కర వైభవం!

**గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు**

**మంత్రి కొండా సురేఖ రివ్యూ**

గోదావరి పుష్కరాలు అంటే ఇప్పటివరకు రాజమహేంద్రవరం పేరు ఎక్కువగా వినిపిం చేదని, ఇకపై "గోదావరి పుష్కరాలు అంటే తెలం గాణ.. తెల ంగాణ అంటే గోదావరి పుష్కరాలు" అనేలా నిర్వహణ ఉండాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.

- వివరాలు 2లో...



# నేరాలపై నిఘా.. బ్యాట్‌తో బాదుడు!

**58 ఏళ్ల వయసులో డీజీపీ సెంచరీ**

- వివరాలు 2లో...

# కులగణనలో కోడ్ లేకపోతే లెక్కే తప్పు!

**ప్రతి కులానికి యూనిక్ కోడ్ ఇవ్వాలి**

**కులగణనకు శాస్త్రీయ విధానం అవసరం**

**బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం ఛైర్మన్ చిరంజీవులు**

**ఢిల్లీలో బీసీల కోసం జాతీయ సదస్సు**



ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించి నప్పుడే కులగణనకు శాస్త్రీయత, పారదర్శకత వస్తుందని బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం ఛైర్మన్ టి. చిరంజీవులు అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కాలమ్ లు ఉన్నట్టే ఓబీసీలు, జన రల్ వర్గాలకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని సూచిం చారు. డ్రాప్‌డౌన్ విధానంలో ప్రతి కులా నికి ప్రత్యేక కోడ్ ఇచ్చి జనాభాను నమోదు చేయాలని కోరారు. ఒకే కులానికి వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు పేర్లు ఉండటం వల్ల గణాంకాల్లో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. కచ్చితమైన లెక్కలు లేకుండా రూపొందించే విధానాలు భవిష్యత్‌లో సామాజిక న్యాయానికి నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాధనంతో చేపడుతున్న జనగణన ప్రక్రియలో తప్పులకు తావులేకుండా ముందుగానే శాస్త్రీయ విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు.

- వివరాలు 2లో...



# రూ.500 కోట్ల భూమి రూ.87 కోట్లకేనా?

### అజామాబాద్ భూమిపై హరీశ్ ఆరోపణలు

ప్రజా సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసి, ప్రభుత్వ ఆస్తుల ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే విధానాన్ని అవలంబిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఆరోపించారు. హైదరాబాద్ అజామా బాద్‌లోని 15,984 గజాల ఆయిల్‌ఫెడ్ ప్రభుత్వ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.500 కోట్లు ఉంటే, కేవలం రూ.87 కోట్లకే ప్రైవేట్ వ్యక్తికి కేటాయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. ఈ భూమికి సంబంధించిన మొత్తాన్ని చెల్లించేందుకు ఆయిల్‌ఫెడ్ సంస్థ సిద్ధంగా ఉన్నప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకో లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పులను సైతం పట్టించుకోకుండా ప్రభుత్వ ఆస్తిని కారుచౌకగా ప్రైవేట్ పరం చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. - వివరాలు 2లో...

# వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

**420 మోసాలపై తెలంగాణ వ్యాప్తంగా పోరుబాట**




100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ తీవ్రంగా ఆరోపిస్తోంది. కాంగ్రెస్ పాలనలో ప్రజలు మోసపోయారని చెబుతూ ఆ పార్టీ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారెంటీల అమలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది.



# బిలావల్ పెళ్లి

**యూరోపియన్ యువరాణితోనా?**

**వైరల్ వార్తలతో పాక్‌లో హడావుడి**

# రూ.500 కోట్ల భూమి రూ.87 కోట్లకేనా?

## అజామాబాద్ భూమిపై హరీశ్ ఆరోపణలు



ప్రజా సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసి, ప్రభుత్వ ఆస్తుల ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే విధానాన్ని అవలంబిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఆరోపించారు. హైదరాబాద్ అజామా బాద్‌లోని 15,984 గజాల ఆయిల్‌ఫెడ్ ప్రభుత్వ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.500 కోట్లు ఉంటే, కేవలం రూ.87 కోట్లకే ప్రైవేట్ వ్యక్తికి కేటాయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. ఈ భూమికి సంబంధించిన మొత్తాన్ని చెల్లించేందుకు ఆయిల్‌ఫెడ్ సంస్థ సిద్ధంగా ఉన్నప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకో లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పులను సైతం పట్టించుకోకుండా ప్రభుత్వ ఆస్తిని కారుచౌకగా ప్రైవేట్ పరం చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్ హయాంలో కాపాడామన్న హరీశ్

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వందల కోట్ల విలువైన ఈ ప్రభుత్వ ఆస్తిని ప్రైవేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు సామాన్యుల ఆస్తులను 22ఏ నిబంధనల పేరుతో లాక్కుంటూ, ప్రభుత్వ భూములను మాత్రం పెద్దలకు తక్కువ ధరకే అప్పగిస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన ప్రభుత్వం మరోవైపు వాటిని విక్రయించే రియల్ ఎస్టేట్ సంస్థలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు చెందాల్సిన భూములపై ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

### కేటాయింపు రద్దు చేయాలంటూ డిమాండ్

అజామాబాద్‌లోని ఆయిల్‌ఫెడ్ భూమి కేటాయింపును వెంటనే రద్దు చేసి, 15,984 గజాల భూమిని ఆయిల్‌ఫెడ్ సంస్థకే అప్పగించడంతో పాటు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని కోరారు. భూమి విలువ, కేటాయింపు ధర మధ్య ఉన్న భారీ వ్యత్యాసంపై సమగ్ర విచారణ జరపాలని సూచించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. కేటాయింపు రద్దయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ప్రజా ప్రయోజనాలే తమ పోరాటానికి ప్రధాన అంశాలని పేర్కొన్నారు.

# నేరాలపై నిఘా.. బ్యాట్‌తో బాదుడు!

## 58 ఏళ్ల వయసులో డీజీపీ సెంచరీ

ఎప్పుడూ నేరాలు, ఘోరాలు, అక్రమాలు, అన్యాయాలపై ఫోకస్ పెట్టే తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఈసారి మాత్రం పూర్తిగా క్రికెట్‌పై దృష్టి పెట్టారు. 58 ఏళ్ల వయసులోనూ తన బ్యాటింగ్ దూకుడు ఏమాత్రం తగ్గలేదని సెంచరీతో చాటిచెప్పారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సీ–డివిజన్ వన్డే లీగ్‌లో సికింద్రాబాద్ క్లబ్ తరఫున బరిలోకి దిగిన సీవీ ఆనంద్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్‌గా వచ్చిన ఆయన కేవలం 82 బంతుల్లోనే 126 పరుగులతో నాటౌట్‌గా నిలిచి శతకం పూర్తి చేశారు. ఈ ఇన్నింగ్స్‌లో 21 ఫోర్లు, 5 సిక్సర్లు బాదారు. ఆయన దూకుడైన బ్యాటింగ్‌తో సికింద్రాబాద్ క్లబ్ 328 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం బౌలింగ్‌లోనూ సీవీ ఆనంద్ తన సత్తా చూపించారు. 5 ఓవర్లు వేసి కేవలం 8 పరుగులు మాత్రమే ఇచ్చారు. వర్షం ప్రభావంతో మ్యాచ్ వీఏజేడీ విధానంలో ముగియగా, సికింద్రాబాద్ క్లబ్ 95 పరుగుల తేడాతో విజయం సాధించింది.

### క్రికెట్‌పై పాత ప్రేమ.. ఇంకా అదే జోష్

సీవీ ఆనంద్‌కు క్రికెట్ కొత్తేమీ కాదు. ఐపీఎస్ అధికారి కాకముందే ఆయన క్రికెట్ ఆడేవారు. చదువుకునే రోజుల్లోనే అండర్–22 స్థాయికి ఎంపికైన ఆయన, సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఆడుతూ ఐదు సెంచరీలు సాధించారు. తాజాగా కొట్టిన 126 నాటౌట్ కూడా అదే క్రికెట్ ప్రతిభకు మరో నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా 58 ఏళ్ల వయసులో 82 బంతుల్లోనే శతకం పూర్తి చేయడం క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించడం ఆయన ఆల్‌రౌండ్ సామర్థ్యాన్ని చాటింది. క్రికెట్‌తో పాటు 2019 అఖిల భారత టెన్నిస్ టోర్నీలో ప్రథమ స్థానం సాధించిన సీవీ ఆనంద్, పలు గోల్ఫ్ టోర్నమెంట్లలోనూ పాల్గొన్నారు. విధుల్లో ఎంత బిజీగా ఉన్నా ఆటపై ఆసక్తిని కొనసాగిస్తున్న ఆయన తాజాగా సెంచరీతో మరోసారి వార్తల్లో నిలిచారు. రోజూ నేరస్థులపై దూకుడు చూపించే డీజీపీ.. ఈసారి బ్యాట్‌తో బౌలర్లపై దూకుడు చూపించి శతకం బాదడం ప్రత్యేక ఆకర్షణగా మారింది.



# తెలంగాణలో పుష్కర వైభవం!

## గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు.. మంత్రి కొండా సురేఖ రివ్యూ



గోదావరి పుష్కరాలు అంటే ఇప్పటివరకు రాజమహేంద్రవరం పేరు ఎక్కువగా వినిపించేదని, ఇకపై "గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు" అనేలా నిర్వహణ ఉండాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు–2027ను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ప్రజాభవన్‌లో పుష్కరాల ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఆలయాలు, ఘాట్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు కనిపించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం కేంద్రంగా పనిచేయనుంది.

### పనుల్లో నాణ్యతే ప్రధాన లక్ష్యం

పుష్కరాల కోసం చేపట్టే నిర్మాణాలు తాత్కాలికంగా కాకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అత్యున్నత నాణ్యతతో నిర్మించాలని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల నేపాల్‌లో భారీ వరదలు వచ్చినా ఒక ఇల్లు మాత్రం చెక్కుచెదరకుండా నిలిచిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, పుష్కరాల పనుల్లోనూ అదే స్థాయి నిర్మాణ నాణ్యత ఉండాలని అధికారులకు సూచించారు. భక్తులు స్నానాలు చేసే ఘాట్ల వద్ద పటిష్టమైన గ్రిల్స్, మహిళలకు ప్రత్యేకంగా దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే టైర్–1, టైర్–2, టైర్–3 పరిధిలో 5 కిలోమీటర్లకు పైగా ఘాట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. అప్రోచ్ రోడ్లు, వైద్య, పోలీస్, పర్యాటక శాఖలకు అవసరమైన నిధులు విడుదలయ్యాయి. పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం వెంట ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన రవాణా, భద్రత, వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తెలంగాణ గోదావరి పుష్కరాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



# వెయ్యి రోజుల్లో తెలంగాణకు కొత్త దిశ

## ప్రజాస్వామ్యం, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

### ప్రజల చేతుల్లోకి పాలన: మంత్రి ఉత్తమ్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం రాష్ట్ర రాజకీయ ప్రస్థానంలో కీలక మైలురాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ప్రభుత్వం మారడమే కాదు.. ప్రజాస్వామ్య స్ఫూర్తి పునరుద్ధరించామని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చుట్టూ కేంద్రీకృతమైందని విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల గొంతుకకు ప్రాధాన్యం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పరిస్థితికి ముగింపు పలికిందని తెలిపారు. ప్రజావాణి, గ్రామసభలు, ప్రత్యక్ష ప్రజా సంప్రదింపుల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చామని వెల్లడించారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణతో పాటు సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేశామని ఉత్తమ్ తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడ్డామని చెప్పారు. గృహజ్యోతి ద్వారా అర్హ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. పౌరసరఫరాల రంగంలో సంస్కరణలు చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల మందికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కొత్త రేషన్ కార్డులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు ఇందిరమ్మ ఇళ్లపథకం ద్వారా పేద కుటుంబాలకు 5 లక్షల సహాయం అందిస్తున్నామని తెలిపారు.

### రైతు నుంచి యువత వరకు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని మంత్రి చెప్పారు. రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసి దాదాపు 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేశామని, రైతు భరోసాను ఎకరానికి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్లకు బోనస్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చామని చెప్పారు. మరోవైపు దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, పట్టణ మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణలో పురోగతి సామాజిక న్యాయానికి నిదర్శనమన్నారు.

# వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

## 420 మోసాలపై తెలంగాణ వ్యాప్తంగా పోరుబాట




100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ తీవ్రంగా ఆరోపిస్తోంది. కాంగ్రెస్ పాలనలో ప్రజలు మోసపోయారని చెబుతూ ఆ పార్టీ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారెంటీల అమలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లు బీఆర్ఎస్ ఆరోపిస్తున్న 420 మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా భారీ రాజకీయ ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా గ్రామాలు, పట్టణాలు, నియోజకవర్గాల స్థాయిలో ప్రజలను కలుస్తూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను కేంద్రంగా చేసుకుని సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు తెలంగాణవ్యాప్తంగా బీఆర్ఎస్ పోరుబాట చేపట్టనుంది. పోస్టర్లు, సమావేశాలు, నిరసనలు, ప్రజా కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ హామీలను ప్రజల ముందుంచి సమాధానం కోరనుంది. ఇందులో ఆరు గ్యారెంటీల అమలు నుంచి రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, విద్యార్థులు, పేద కుటుంబాలకు సంబంధించిన అంశాల వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉంది. "ప్రజా గళమై కదం తొక్కుదాం.. కాంగ్రెస్ మోసపూరిత పాలనపై తిరగబడదాం" అంటూ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంతో పాటు పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని నిరూపించేందుకు బీఆర్ఎస్ ఈ పోరును రాజకీయ వేదికగా మలచాలని చూస్తోంది.

# కులగణనలో కోడ్ లేకపోతే లెక్కే తప్పు!

### ప్రతి కులానికి యూనిక్ కోడ్ ఇవ్వాలి

**కులగణనకు శాస్త్రీయ విధానం అవసరం**

**బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు**

**ఢిల్లీలో బీసీల కోసం జాతీయ సదస్సు**



ఢిల్లీ, తెలంగాణ భవన్‌లో "జనగణనలో కుల గణన–ప్రతి కులానికి యూనిక్ కోడ్" అనే ప్రధాన డిమాండ్‌తో జాతీయ సదస్సు నిర్వహించారు. బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి.చిరంజీవులు సదస్సుకు అధ్యక్షత వహించారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసి యేషన్ తరఫున గౌడ కిరణ్ కుమార్ సమన్వయం చేశారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, రాజ్యసభ సభ్యుడు విల్సన్, డా.సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, బాల్‌రాజ్ గౌడ్, సుగురు దుర్గయ్య తది తరులు పాల్గొన్నారు. కులాల వారీగా ఖచ్చితమైన జనాభా వివరాలు అందుబాటులోకి రావాలంటే ప్రస్తుత విధానంలో మార్పులు అవసరమని వక్తలు స్పష్టం చేశారు.

### కులగణన లేకుండా రిజర్వేషన్లు ఎలా?

తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల ప్రయత్నాలు జరిగినా కోర్టుల్లో న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బీసీ జనాభా అధికారికంగా ఎంతుందో తేల్చకుండా రిజర్వేషన్ల శాతం ఎలా నిర్ణయిస్తారని న్యాయస్థానాలు ప్రశ్నిస్తున్నాయని చెప్పారు. అందుకే కేంద్రం వెంటనే రాజ్యాంగ సవరణ చేసి, జనగణ నలో బీసీల కులాల వారీ లెక్కలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కులానికి ప్రత్యేక నంబరింగ్ ఇచ్చి ఖచ్చితమైన జనాభా నమోదు చేయాలని కోరారు. చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సముచిత రిజర్వేషన్లు ఇవ్వాలి అని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీసీలు ఉద్యమ బాట పడతారని హెచ్చరించారు

### ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలి

కులగణనలో ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని సదస్సులో పాల్గొన్న నాయకులు, మేధావులు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కాలమ్‌లు ఉన్నట్టే ఓబీసీలకు ప్రత్యేక కాలమ్, జనరల్ వర్గాలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి, ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఇవ్వాలని సూచించారు. డ్రాప్‌డౌన్ విధానంలో కులాల పేర్లను నమోదు చేస్తే ఒకే కులానికి వివిధ ప్రాంతాల్లో ఉన్న భిన్న పేర్ల కారణంగా తలెత్తే గందరగోళాన్ని నివారించవచ్చని తెలిపారు. డా.సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, రాజ్యసభ సభ్యుడు విల్సన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఏకాభిప్రాయం వచ్చే వరకు కులగణన విధానాన్ని పునఃపరిశీలించాలని కోరారు. శాస్త్రీయ విధానం లేకుండా గణన చేపడితే కేంద్రం ఖర్చు చేస్తున్న సుమారు రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### డిమాండ్ నెరవేరకపోతే ఉద్యమం

కులగణన కేవలం జనాభా లెక్కలు తేల్చే ప్రక్రియ కాదని, భవిష్యత్‌లో విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల రూపకల్పనకు కీలక ఆధారం అవుతుందని సదస్సులో వక్తలు పేర్కొన్నారు. అందుకే ప్రతి కులాన్ని ఖచ్చితంగా గుర్తించి నమోదు చేసే పారదర్శక వ్యవస్థను కేంద్రం వెంటనే రూపొందించాలని కోరారు. ఒకే కులానికి వేర్వేరు పేర్లు, వేర్వేరు గుర్తింపులతో లెక్కలు నమోదైతే వాస్తవ జనాభా గణాంకాలు తప్పే అవకాశం ఉందని తెలిపారు. యూనిక్ కోడ్ ఆధారంగా కులాల వారీగా ఖచ్చితమైన లెక్కలు తీసుకుంటేనే సామాజిక న్యాయానికి బలమైన పునాది ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ డిమాండ్లను పట్టించుకోకుండా ప్రస్తుత విధానంలోనే జనగణన కొనసాగిస్తే దేశవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని సదస్సు నాయకులు హెచ్చరించారు.

# రైలు అభివృద్ధికి భారీగా నిధులు

### వికారాబాద్ రైల్వేకు ఆధునిక రూపం

### అలంపూర్‌లో ఆధ్యాత్మిక శోభ

### పర్యాటకానికి కొత్త ఊపు: కిషన్‌రెడ్డి





వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణ రైల్వే అభివృద్ధిపై కీలక వివరాలు వెల్లడించారు. రూ.27 కోట్లతో వికారాబాద్ స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని, రోజుకు సుమారు 15 వేల మంది ప్రయాణికులు, 60 రైళ్లు రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, వీఐపీ లాంజ్, పార్కింగ్ వంటి వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లు ఏకకాలంలో అభివృద్ధి చెందుతున్నాయని, చర్లపల్లి టెర్మినల్‌తో పాటు వికారాబాద్, తాండూరు, నాంపల్లి, సికింద్రాబాద్, మౌలాలి స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. రాష్ట్రంలో సుమారు రూ.80 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్‌తో పాటు రైల్వే లైన్ల విద్యుద్దీకరణ పూర్తయిందన్నారు. కవచ్, కవచ్ 2.0 సాంకేతికతను తెలంగాణలో అమలు చేస్తున్నామని, హైదరాబాద్ నుంచి ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కాజీపేట రైల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు 90% పూర్తయ్యాయని, భవిష్యత్‌లో హైదరాబాద్–బెంగళూరు, హైదరా బాద్–పుణే బుల్లెట్ రైళ్లతో కనెక్టివిటీ మరింత పెరుగుతుందని చెప్పారు.

### అలంపూర్‌లో ఆధ్యాత్మిక టూరిజానికి కొత్త వెలుగు

అలంపూర్‌లో రూ.4.60 కోట్లతో ఏర్పాటు చేసిన మల్టీమీడియా సౌండ్ అండ్ లైట్ షోను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. జోగులాంబ అమ్మవారి క్షేత్రం, నవబ్రహ్మ ఆలయాల చరిత్ర, చాళుక్యుల శిల్పకళను ఆధునిక సాంకేతికతతో భక్తులు, పర్యా టకులకు పరిచయం చేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రసాద్ పథకం కింద రూ.47 కోట్లతో ఆలయ ప్రాంతంలో అన్నదాన సత్రం, కల్యాణ మండపం, విశ్రాంతి గదులు, ఫుడ్‌కోర్టు, మల్టీమీడియా రూమ్, ఓపెన్ ఎయిర్ ఆంఫీ థియేటర్, బోటింగ్, ఫ్లోటింగ్ జెట్టీ, పార్కింగ్, సోలార్ లైటింగ్ వంటి వసతులు కల్పించినట్లు తెలిపారు. తెలంగాణలో 15 ప్రధాన పర్యాటక ప్రాజెక్టులకు ఇప్పటివరకు రూ.614.32 కోట్ల కేంద్ర సహాయం అందించామని చెప్పారు. అలంపూర్‌తో పాటు జూరాల, బీచుపల్లి, గద్వాల్ కోట, కృష్ణా–తుంగభద్ర ప్రాంతాలను కలుపుతూ సమగ్ర టూరిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకం పెరిగితే స్థానిక హోటళ్లు, రెస్టారెంట్లు, గైడ్లు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, హస్తకళాకారులు, చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.





# ఇల్లు కొంటున్నారా? ఐతే ఇవి చూసుకోండి!



## ధర కంటే డీల్ ముఖ్యం

### చదరపు అడుగులు కాదు

### స్థలం, నాణ్యతే అసలు విలువ

### స్క్వేర్‌ఫీట్ లెక్కతో మోసపోవద్దు

హైదరాబాద్‌లో సొంత ఇల్లు కొనాలని చూస్తున్నారా? అయితే బ్రోచర్‌లో కనిపించే చదరపు అడుగు ధర ఒక్కటే చూసి నిర్ణయం తీసుకోవద్దు. ఒకే ప్రాంతంలో, దాదాపు ఒకే విస్తీర్ణం ఉన్న రెండు ఫ్లాట్ల ధరల్లో భారీ తేడా ఉండొచ్చు. దీనికి కారణం కేవలం బిల్డర్ బ్రాండ్ కాదు. లొకేషన్, నిర్మాణ నాణ్యత, ఫ్లాట్ ప్లానింగ్, గాలి వెలుతురు, ప్రైవసీ, పార్కింగ్, మెయింటెనెన్స్, కనెక్టివిటీ వంటి అంశాలు అసలు విలువను నిర్ణయిస్తాయి. హైదరాబాద్‌లో ఐటీ కారిడార్ వైపు వెళ్లే కొద్దీ ధరలు పెరగడం సహజమే. అయితే ఎక్కువ ధర పెట్టినంత మాత్రాన మంచి ఇల్లు దొరుకుతుందని అనుకోవడం తప్పు. పెద్ద ఫ్లాట్ కంటే సరైన లొకేషన్‌లో బాగా ప్లాన్ చేసిన ఇల్లు ఎక్కువ విలువ ఇవ్వొచ్చు.

**లొకేషన్ విషయంలో ఆలోచన మారాలి**

హైదరాబాద్ బయ్యర్లు ముఖ్యంగా ఆఫీస్, స్కూల్, హాస్పిటల్, మెట్రో, ప్రధాన రోడ్లు, రోజువారీ అవసరాలు ఎంత దూరంలో ఉన్నాయో పరిశీలించాలి. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, కొండాపూర్, నార్సింగి, కోకాపేట్, మియాపూర్, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో ధరను కేవలం ఈరోజు మార్కెట్‌తో పోల్చడం సరిపోదు. రాబోయే 5--10 ఏళ్లలో ఆ ప్రాంతంలో రోడ్లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, వాణిజ్య కేంద్రాలు, ఇతర మౌలిక వసతులు ఎలా అభివృద్ధి చెందుతాయో కూడా చూడాలి. కొంచెం ఎక్కువ ధర పెట్టినా ప్రయాణ సమయం తగ్గితే, సౌకర్యాలు పెరిగితే ఆ ప్రీమియం సమర్థించుకోవచ్చు. ఇంటికి పెట్టే అదనపు డబ్బు మీ జీవన ప్రమాణాన్ని నిజంగా పెంచుతుందా? అన్నదే బయ్యర్ వేసుకోవాల్సిన అసలు ప్రశ్న.

**పెద్ద ఇల్లు కాదు.. మంచి ఇల్లు**

హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్టుల్లో ఎక్కువ చదరపు అడుగుల కోసం బయ్యర్లు ఆకర్షితులవుతున్నారు. కానీ ఎక్కువ విస్తీర్ణం అంటే ఎక్కువ విలువ కాదు. గదులు పెద్దగా ఉన్నా గాలి వెలుతురు సరిగా లేకపోతే, స్టోరేజ్ సౌకర్యం లేకపోతే, ప్రైవసీ తగ్గితే ఆ అదనపు స్థలం ఉపయోగం తక్కువే. మరోవైపు చిన్నదైనా మంచి లేఅవుట్, సహజమైన వెలుతురు, వెంటిలేషన్, సరైన రూమ్ ప్లానింగ్ ఉన్న ఫ్లాట్ రోజువారీ జీవితంలో మెరుగైన అనుభవం ఇవ్వొచ్చు. అలాగే బిల్డర్ గత ప్రాజెక్టులు, నిర్మాణ నాణ్యత, హ్యాండోవర్ రికార్డు, మెయింటెనెన్స్ ఖర్చులు, అమెనిటీల వాస్తవ వినియోగం తప్పనిసరిగా పరిశీలించాలి. బ్రోచర్‌లో స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్, జిమ్ వంటి అమెనిటీలు కనిపిస్తున్నాయని మాత్రమే అదనపు ధర చెల్లించ కూడదు. మీ కుటుంబం నిజంగా ఉపయోగించే సౌకర్యాలకే విలువ ఇవ్వాలి. చివరికి మంచి ఇల్లు అంటే తక్కువ ధరలో దొరికేదీ కాదు, ఎక్కువ ధర ఉన్నదీ కాదు. పెట్టిన డబ్బుకు దీర్ఘకాలంలో మెరుగైన జీవన నాణ్యత, సౌకర్యం, నమ్మకమైన విలువ ఇచ్చేదే సరైన ఇల్లు.

# బిలావల్ పెళ్లి



### యూరోపియన్ యువరాణితోనా?

### వైరల్ వార్తలతో పాక్‌లో హడావుడి

పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ త్వరలో యూరప్ రాజకుటుంబానికి చెందిన యువరాణిని పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. 38 ఏళ్ల బిలావల్ కోసం వివాహం ఖరారైందని, పెళ్లి తేదీని నిర్ణయించేందుకు ఆయన తండ్రి, పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ యూరప్‌లోని లిక్టెన్‌స్టెయిన్‌కు వెళ్లారని ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలను పీపీపీ కీలక నేత, కరాచీ మేయర్ ముర్తజా వహాబ్ తీవ్రంగా ఖండించారు. బిలావల్ నిశ్చితార్థం, పెళ్లికి సంబంధించిన వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం అని ఆయన ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

**రాజకుటుంబంతో పెళ్లంటూ ప్రచారం**

ఈ వ్యవహారంలో మరో సంచలన ప్రచారం కూడా జరిగింది. బిలావల్ పెళ్లి చేసుకోబోయేది 26 ఏళ్ల మాజీ ఆస్ట్రియన్ ఆర్చ్‌డచెస్ గ్లోరియా వాన్ హ్యాబ్స్‌బర్గ్ అంటూ కొన్ని కథనాలు వెలువడ్డాయి. ఆమె ఆస్ట్రియా ఆర్చ్‌డ్యూక్ కార్ల్, ఫ్రాన్సెస్కా వాన్ థైసెన్-బోర్నెమిస్జా కుమార్తె. హ్యాబ్స్‌బర్గ్-లోరైన్ రాజవంశానికి చెందిన ఆమెకు ఆస్ట్రియా చివరి చక్రవర్తి, హంగేరీ చివరి రాజు కార్ల్-1తో కుటుంబ సంబంధం ఉంది. పాకిస్థాన్ అధ్యక్షుడు జర్దారీ యూరప్ పర్యటనకు వెళ్లడం ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చింది. ఆగస్టు 27న అధ్యక్ష భవనం కూడా జర్దారీ వ్యక్తిగత పర్యటనపై విదేశాలకు వెళ్లినట్లు ధ్రువీకరించింది. అయితే పర్యటన ఉద్దేశాన్ని మాత్రం వెల్లడించలేదు.

**ఆధారాలు లేవు.. కుటుంబం మౌనం**

పాకిస్థాన్‌కు చెందిన ఉర్దూ పత్రిక 'డైలీ ఔసాఫ్' కూడా వివాహ ఏర్పాట్లు జరుగుతున్నాయని, జర్దారీ ఈ విషయానికే సంబంధించి యూరప్‌లో వ్యక్తిగత పర్యటన చేస్తున్నారని పేర్కొంది. అయితే ఆ కథనం కొంతకాలానికే తొలగించబడింది. ఇప్పటివరకు బిలావల్ భుట్టో గానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ పెళ్లి వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాలకు అధికారిక ఆధారం లేదని స్పష్టమవుతోంది. పీపీపీ నేత చేసిన ఖండనతో యూరోపియన్ యువరాణితో బిలావల్ వివాహం అంటూ సాగిన ప్రచారానికి ప్రస్తుతానికి తెరపడినట్టయింది.

# మన ఐక్యతే మన బలం

### ముస్లిం దేశాలకు మొజ్తబా ఖమేనీ పిలుపు

### అమెరికా, ఇజ్రాయెల్ అసలు శత్రువులు



ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ముస్లిం దేశాల మధ్య ఐక్యతకు పిలుపునిచ్చారు. మధ్యప్రాచ్య యుద్ధం ప్రారంభమై ఆరు నెలలు పూర్తైన నేపథ్యంలో ఆదివారం ఆయన రాతపూర్వక సందేశం విడుదల చేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ప్రాంతీయ ముస్లిం దేశాలు ఒక్కటిగా నిలవాలని ఆయన కోరారు. ముస్లిం దేశాల సమస్యలకు పరిష్కారం పరస్పర స్నేహం, సహకారం, ఐక్యతలోనే ఉందని పేర్కొన్నారు. ముస్లింల మధ్య విభేదాలు, ఘర్షణలకు కారణమయ్యే చర్యలు తెలిసో తెలియకో శత్రువుల ప్రయోజనాలకు ఉపయోగపడతాయని హెచ్చరించారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన ఈ సందేశాన్ని ఇచ్చారు.

**అసలు శత్రువును గుర్తించండి**

ప్రాంతీయ దేశాల పాలకులు తమ అసలు శత్రువు ఎవరో గుర్తించి, వారి వ్యూహాన్ని అర్థం చేసుకుని ఎదుర్కోవాలని మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఆయన వ్యాఖ్యలు ప్రధానంగా అమెరికా, ఇజ్రాయెల్‌ను ఉద్దేశించినవేనని స్పష్టమవుతోంది. ఇటీవల జరిగిన యుద్ధంలో ఇరాన్ మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు జరిగాయి. ఈ పరిణామాల తర్వాత ఇరాన్‌కు ఆ దేశాలతో సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. ప్రాంతీయ దేశాలు తమ మధ్య విభేదాలను పక్కనపెట్టి ఒకే వైఖరితో ముందుకు రావాలన్నదే ఖమేనీ సందేశం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

**ఇరాన్‌లోనూ ఐక్యతకు పిలుపు**

దేశ ప్రజలు, ప్రభుత్వ అధికారులు కూడా అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉండాలని మొజ్తబా ఖమేనీ సూచించారు. సామాజిక ఐక్యతను దెబ్బతీసే చర్యలను అనుమతించబోమని ఆయన ఇప్పటికే శుక్రవారం ఇచ్చిన సందేశంలో స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఇరాన్ ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల పైనా ఆయన దృష్టి పెట్టారు. డాలర్‌పై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడంతో పాటు దేశీయ ఉత్పత్తిని పెంచాలని పిలుపునిచ్చారు. అమెరికా ఆంక్షలు, నెలల తరబడి కొనసాగిన ఆంక్షల ప్రభావంతో ఇరాన్ ప్రజల జీవనంపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. మరోవైపు, తండ్రి అలీ ఖమేనీ ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభ సమయంలో మరణించిన తర్వాత అధికారంలోకి వచ్చిన మొజ్తబా ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. ఆయనకు సంబంధించిన వీడియో, ఆడియోను కూడా ఇరాన్ అధికారులు ఇప్పటివరకు విడుదల చేయలేదు.



# భారత్-ఉజ్బెకిస్థాన్ బంధం బలోపేతం

### వ్యూహాత్మక భాగస్వామ్యానికి కీలక అడుగు

### కిర్గిస్థాన్ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ

భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య సంబంధాలు మరో కీలక దశకు చేరుకున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయేవ్ మధ్య జరిగిన చర్చల అనంతరం ఇరు దేశాలు తమ సంబంధాలను 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం'గా పెంచాలని నిర్ణయించాయి. ప్రస్తుతం సుమారు 1 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి ఏటా 5 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక వసతులు, రక్షణ, వ్యవసాయం, ఔషధాలు, ఆరోగ్యం, ఐటీ, డిజిటల్ మౌలిక వసతులు, విద్య, కీలక ఖనిజాల రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు 11 ఒప్పందాలు కుదిరాయి. అణుశక్తి రంగంలో సహకారంలో భాగంగా ఉజ్బెకిస్థాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా యురేనియం సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించడం ఈ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం తెచ్చింది. రక్షణ రంగంలో సంయుక్త అభివృద్ధి, సంయుక్త ఉత్పత్తికి అవకాశాలు పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

**వాణిజ్యం నుంచి భద్రత వరకు**

మధ్య ఆసియాలో ఉజ్బెకిస్థాన్ కీలక స్థానంలో ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్-ఉజ్బెకిస్థాన్ బలమైన భాగస్వామ్యం మధ్య ఆసియాలో శాంతి, అభివృద్ధి, సుసంపన్నతకు బలమైన శక్తిగా మారుతుందని అన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదంపై సున్నా సహనం పాటించాలన్న విషయంలో ఇరు దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. విదేశాంగ మంత్రుల స్థాయిలో కోఆర్డినేషన్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భారత్ యూపీఐ యాప్‌లతో ఉజ్బెకిస్థాన్ జాతీయ యూజడ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వ్యాపార చెల్లింపులు చేసే అవకాశం కల్పించే ఒప్పందం కూడా కుదిరింది. కీలక ఖనిజాల అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్‌లో సంయుక్త ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఉజ్బెకిస్థాన్‌లోని ప్రాచీన బౌద్ధ క్షేత్రాలైన ఫయాజ్ టెపా, కారా టెపా సంరక్షణకు భారత్ సహకరించనుంది. అరల్ సముద్ర ప్రాంతంలో అటవీ పునరుద్ధరణకు భారత్ 1 మిలియన్ డాలర్ల గ్రాంట్ ప్రకటించింది. ఆర్థిక, రక్షణ, అణుశక్తి, డిజిటల్, సాంస్కృతిక రంగాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా భారత్-ఉజ్బెకిస్థాన్ బంధానికి కొత్త దిశ ఏర్పడింది.



# జావో జోంగ్‌కీపై జిన్‌పింగ్ వేటు

### డోక్లామ్ నుంచి గల్వాన్ జనరల్‌కు షాక్

### భారత్ సరిహద్దు బాధ్యతలు ఆయనవే



భారత్‌తో చైనా సరిహద్దు ఉద్రిక్తతల్లో కీలక పాత్ర పోషించిన చైనా సైనిక అధికారి జావో జోంగ్‌కీకి తాజాగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చైనా అత్యున్నత రాజకీయ సలహా సంస్థ అయిన చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ) నుంచి ఆయనను తొలగించారు. మరో రెండు పదవుల నుంచి కూడా ఆయనను తప్పించినట్లు సమాచారం. జావో జోంగ్‌కీ 2016లో ఏర్పాటైన వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు తొలి కమాండర్‌గా బాధ్యతలు చేపట్టారు. భారత్‌తో చైనా సరిహద్దు వ్యవహారాలను పర్యవేక్షించే కీలక సైనిక విభాగం ఇదే. ఆయన హయాంలోనే 2017 డోక్లామ్ ప్రతిష్ఠంభన, 2020 గల్వాన్ ఘర్షణ చోటుచేసుకున్నాయి. దీంతో జావో పేరు భారత్-చైనా సరిహద్దు ఉద్రిక్తతలతో బలంగా ముడిపడింది.

**16 ఏళ్లకే సైన్యంలో ప్రవేశం**

1955లో చైనాలోని హీలాంగ్‌జియాంగ్ ప్రావిన్స్‌లో జన్మించిన జావో జోంగ్‌కీ కేవలం 16 ఏళ్ల వయసులోనే పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో చేరారు. 1979 చైనా-వియత్నాం యుద్ధంలో పశ్చిమ ఫ్రంట్‌లో పోరాడారు. అనంతరం 1986--88 మధ్య అరబిక్ భాషను అభ్యసించారు. టాంజానియాలోని చైనా రాయబార కార్యాలయంలో మిలిటరీ అటాషేగా కూడా పనిచేశారు. 1989లో చైనాకు తిరిగి వచ్చిన తర్వాత కీలక సైనిక బాధ్యతలు చేపట్టారు. టిబెట్ మిలిటరీ రీజియన్‌లో పనిచేశారు. పీఎల్‌ఏ 13వ, 14వ గ్రూప్ ఆర్మీలకు కమాండర్‌గా వ్యవహరించారు. 2009లో లెఫ్టినెంట్ జనరల్‌గా, 2015లో జనరల్‌గా పదోన్నతి పొందారు. 2016లో వెస్ట్రన్ థియేటర్ కమాండ్ తొలి కమాండర్‌గా ఎంపికై చైనా పశ్చిమ సరిహద్దులపై కీలక బాధ్యతలు నిర్వహించారు. ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్న జావో సైనిక జీవితంలోని దృశ్యాలను కెమెరాలో బంధించేవారని సమాచారం.

**సైన్యంలో అవినీతి వేట.. కీలక మార్పులు**

జావోపై తాజా చర్య చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సైన్యంలో కొనసాగిస్తున్న అవినీతి వ్యతిరేక చర్యల్లో భాగంగానే భావిస్తున్నారు. ఇదే సమయంలో చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ)లోని ఇద్దరు అత్యున్నత అధికారులపై కూడా వేటు పడింది. సీఎంసీ వైస్ చైర్మన్ జాంగ్ యూషియా, జాయింట్ స్టాఫ్ డిపార్ట్‌మెంట్ చీఫ్ లియూ జెన్‌లీపై తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘనలు, చట్ట ఉల్లంఘనలపై దర్యాప్తు తర్వాత చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఏడుగురు సభ్యుల సీఎంసీలో ప్రస్తుతం ఇద్దరు మాత్రమే క్రియాశీల సభ్యులుగా మిగిలారు. వారిలో షీ జిన్‌పింగ్ కూడా ఉన్నారు. దీంతో చైనా సైన్యంలో అత్యున్నత స్థాయిలో జరుగుతున్న మార్పులు ఇప్పుడు మరింత కీలకంగా మారాయి. ముఖ్యంగా భారత్ సరిహద్దు వ్యవహారాలను పర్యవేక్షించిన మాజీ కమాండర్‌పై చర్యలు తీసుకోవడం చైనా సైనిక వ్యవస్థలో జరుగుతున్న ప్రక్షాళనపై ఆసక్తిని పెంచుతోంది.







# ఒక్క హెచ్చరిక

## 1,643 మంది ప్రాణాలు కాపాడాడు



### ఫోన్ కాల్‌తో మొదలైన అప్రమత్తత

### టీచర్ ఆలోచనతో తప్పిన పెను విషాదం

నేపాల్‌లోని నువాకోట్ జిల్లాలో సంభవించిన భయంకర వరదల్లో ఓ పాఠశాల ప్రిన్సిపాల్ చూపిన సమయస్ఫూర్తి 1,643 మంది విద్యార్థుల ప్రాణాలను కాపాడింది. త్రిశూలి వ్యాలీలోని త్రిభువన్ త్రిశూలి సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్, ఇంగ్లిష్ టీచర్ రాజేంద్ర దవాడి బుధవారం ఉదయం పాఠశాలలో ఉన్నారు. ఉదయం 9.20 గంటల సమయంలో ఓ స్నేహితుడు ఫోన్ చేసి సమీప గ్రామాన్ని నది వరద ముంచేసిందని, భారీగా నీరు పాఠశాల వైపు వస్తోందని హెచ్చరించాడు. మొదట పాఠశాల సురక్షితంగానే ఉందని దవాడి భావించారు. నది కంటే సుమారు 60 మీటర్ల ఎత్తులో ఉన్న మూడు అంతస్తుల కాంక్రీట్ భవనం కావడంతో ప్రమాదం ఉండదని అనుకున్నారు. ఇంతలో ఓ విద్యార్థి తల్లి పరుగున వచ్చి నీరు వేగంగా పెరుగుతోందని చెప్పడంతో పరిస్థితి తీవ్రతను ఆయన వెంటనే గుర్తించారు.

**బెల్ మోగించి.. పిల్లలను బయటకు**

ఏ మాత్రం ఆలస్యం చేయకుండా దవాడి పాఠశాల గంట మోగించారు. తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులను వెంటనే బయటకు తీసుకెళ్లాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. స్కూల్ బస్సు డ్రైవర్లకు ఫోన్ చేసి వెనక్కి రావాలని సూచించారు. అయితే ఒక బస్సును మాత్రం ఆయన సంప్రదించలేకపోయారు. అప్పటికే అది వంతెన దాటుతోంది. మరోవైపు 1,643 మంది పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎత్తైన ప్రాంతాల వైపు పరుగులు తీశారు. ఓ బాలిక తీవ్ర భయంతో అస్వస్థతకు గురికావడంతో ఆమెను మోటార్‌సైకిల్‌పై కొండపైకి తీసుకెళ్లారు. మిగిలిన పిల్లలు కాలినడకన సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. దవాడి కూడా వారిని అనుసరించారు. చివరకు పిల్లలంతా ఓ రావిచెట్టు కింద తలదాచుకున్నారు. కొద్దిసేపటికే భారీ వరద నీరు పాఠశాల ప్రాంతాన్ని ముంచెత్తింది. మట్టి, రాళ్లు, మంచు, శిథిలాలు ఉద్ధృతంగా కొట్టుకురావడంతో పాఠశాల భవనంతో పాటు వంతెనలు, ఇతర నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. అయినా మొత్తం 1,643 మంది విద్యార్థులు సురక్షితంగా బయట పడ్డారు.

**పిల్లలు బతికారు.. ఇద్దరు సిబ్బంది మృతి**

పాఠశాల సిబ్బందిలో ఎక్కువమంది కూడా ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ఇద్దరు సిబ్బంది మాత్రం ఈ విపత్తుకు బలయ్యారు. 32 ఏళ్ల సోషల్ హిస్టరీ టీచర్ సంతోష్ పరివార్ నది సమీపంలోని తన అద్దె గదికి అల్పాహారం చేసుకునేందుకు వెళ్లి వరదలో కొట్టుకుపోయారు. స్కూల్ జానిటర్ సుల్తాన్ లామా కూడా పాఠశాల తలుపులు మూసేందుకు తిరిగి వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. లాంగ్‌టాంగ్ లిరుంగ్ శిఖరం సమీపంలో భారీగా మంచు, రాళ్లు విరిగిపడి లెండే ఖోలా నదిలోకి దూసుకురావడంతో ఈ ఆకస్మిక వరద ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విపత్తులో నేపాల్‌లో వంద లాది మంది మరణించగా, 2,500 మందికిపైగా గల్లంతయ్యారు. టిబెట్‌లో 16 మంది మృతి చెందగా, 546 మంది ఆచూకీ తెలియడం లేదు. జలవిద్యుత్ ప్రాజెక్టుల టన్నెల్స్‌లో 100 మందికిపైగా కార్మికులు చిక్కుకున్నట్లు సమాచారం. వారిని రక్షించేందుకు నేపాల్ సైన్యం చర్యలు చేపట్టింది. భారత్ 11 మందితో ప్రత్యేక రెస్క్యూ బృందాన్ని పంపగా, చైనా తొమ్మిది మంది టన్నెల్ రెస్క్యూ నిపుణులను పంపింది. ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా తీసుకున్న నిర్ణయం ఎంతటి విపత్తునైనా ఎదుర్కోవచ్చని రాజేంద్ర దవాడి చూపించారు.





# చీరాలలో రౌడీ మూకల బీభత్సం

## ఆక్వా రైతు ఇంటిపై దాడి.. రాడ్లతో దాడి.. హత్య బెదిరింపులు

వేటపాలెం మండలం కొత్తపేట ఐఎల్టిడి కాలనీలో ఆక్వా రైతు చెరుకూరి లక్ష్మీనారాయణ ఇంటిపై జరిగిన దాడి స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం సాయంత్రం 6:45 నుంచి 7 గంటల మధ్య ఇద్దరు అపరిచిత వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి, చేతుల్లో ఇనుప రాడ్లతో ఇంటిపై విరుచుకుపడ్డారు. ఇంటి తలుపులు, కిటికీ అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు పెరట్లో నిలిపి ఉంచిన కారును కూడా పగలగొట్టారు. దాదాపు పది నిమిషాల పాటు అక్కడ భయానక వాతావరణం సృష్టించిన దుండగులు 'నరుకుతాం.. చంపుతాం' అంటూ బెదిరింపులకు దిగారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మొత్తం ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి.

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా



ఘటనపై సమాచారం తెలుసుకున్న చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దాడిలో ధ్వంసమైన కారు, ఇంటి తలుపులు, కిటికీలు, గృహోపకరణాలను స్వయంగా పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దాడికి పాల్పడిన వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, సీసీటీవీ ఆధారంగా వారిని త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### పోలీసుల రక్షణపై ఆమంచి ప్రశ్న



మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. దాడి జరిగిన ప్రాంతానికి 100 మీటర్లలోపే డీఎస్పీ కార్యాలయం, 150 నుంచి 200 మీటర్ల పరిధిలో టూటౌన్ పోలీస్ స్టేషన్ ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. పోలీస్ కార్యాలయాలు ఉన్న ప్రాంతంలోనే ఇంతటి దౌర్జన్యం జరగడం ఆందోళనకరమన్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇలాంటి ఘటన జరిగితే సామాన్య ప్రజలకు భద్రత ఎక్కడుందని ప్రశ్నించారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని ఆమంచి డిమాండ్ చేశారు. ఘటనపై పోలీసులు వేగంగా స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి?

## ప్రభుత్వంపై తులసి రెడ్డి విమర్శలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎన్. తులసిరెడ్డి విమర్శించారు. ఆదివారం ప్రొద్దుటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 నెలలు గడిచినా అనేక హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెన్షన్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా పూర్తిగా విడుదల కాలేదని, రూ.8 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని తులసిరెడ్డి పేర్కొన్నారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. మరోవైపు ప్రొద్దుటూరు అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నేత నజీర్ ఆరోపించారు. పట్టణంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాజకీయ విమర్శలకు బదులు స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. ప్లాస్టిక్ తయారీ కేంద్రాలపై చర్యలు తీసుకుని వాటిని మూసివేయాలని మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని డిమాండ్ చేశారు.

# సాయిరెడ్డికి సజ్జల కౌంటర్

**పార్టీలో జగన్ ఒక్కరే నాయకుడు**

**మీడియా దృష్టిలో పడేందుకే తపన**

**జగన్‌పై ఆరోపణలకు ఘాటు సమాధానం**




వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేస్తున్న విమర్శలను ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి కొత్త పాత్రలు తెరపైకి వస్తున్నాయని, అందులో భాగంగానే సాయిరెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపించారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిపై వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలు చేయలేదని చెప్పారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం జగన్‌పై అన్యాయమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా మత మార్పిడులపై సాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను సజ్జల తప్పుబట్టారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి అన్ని మతాలను గౌరవించే విధానమే కొనసాగిందని స్పష్టం చేశారు. సాయిరెడ్డి మీడియా దృష్టిని ఆకర్షించేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

### నంబర్ వన్ జగన్.. మిగతావాళ్లంతా కార్యకర్తలే

పార్టీలో తనకంటే ఎక్కువ ప్రాధాన్యం సాయిరెడ్డికే జగన్ ఇచ్చారని సజ్జల గుర్తుచేశారు. టీటీడీ సభ్యత్వం నుంచి రాజ్యసభ సభ్యత్వం వరకు సాయిరెడ్డికి అనేక పదవులు దక్కాయని, రెండుసార్లు రాజ్యసభకు అవకాశం కల్పించారని చెప్పారు. ప్రాధాన్యం తగ్గించారనే ఆరోపణలకు ఇదే సమాధానమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీలో జగన్ ఒక్కడే నాయకుడని, మిగిలిన వారంతా కార్యకర్తలేనని స్పష్టం చేశారు. తాను, సాయిరెడ్డి ఇద్దరూ జగన్ నాయకత్వంలో తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వర్తించామని తెలిపారు. కాంగ్రెస్‌లో వినిపించే 'కోటరీ' పదాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం అర్థరహితమన్నారు. జగన్ పార్టీని ఒంటరిగా నిర్మించి బలమైన రాజకీయ శక్తిగా నిలబెట్టారని చెప్పారు.

### జగన్ వల్లే సాయిరెడ్డికి గుర్తింపు

సాయిరెడ్డి పార్టీని వీడినప్పుడు వ్యక్తిగత కారణాలేనని చెప్పారని సజ్జల గుర్తుచేశారు. ఇప్పుడు కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రయత్నాల్లో భాగంగా జగన్‌పై విమర్శలు చేయడం తగదన్నారు. సాయిరెడ్డి రాజకీయంగా గుర్తింపు పొందడానికి జగన్ నాయకత్వమే ప్రధాన కారణమని వ్యాఖ్యానించారు. జగన్‌పై చేసిన ఆరోపణలతో ఆయన గౌరవం తగ్గదని, వైఎస్సార్‌సీపీ ప్రతిష్ఠకు నష్టం ఉండదని అన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి అంశాలను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. సాయిరెడ్డి కొత్త రాజకీయ ప్రయాణం ప్రారంభించాలనుకుంటే చేసుకోవచ్చని, కానీ అందుకోసం జగన్‌ను లక్ష్యంగా చేసుకోవడాన్ని సహించబోమన్నారు.

### 'కోటరీ' ఆరోపణకు టీమ్‌వర్క్ కౌంటర్

రాష్ట్రంలో అసలు చర్చించాల్సిన అంశాలను పక్కనపెట్టి వ్యక్తిగత ఆరోపణల చుట్టూ రాజకీయ చర్చను తిప్పుతున్నారని సజ్జల ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై దృష్టి మళ్లించడమే ఇలాంటి ప్రచారం ఉద్దేశమని అన్నారు. సాయిరెడ్డి భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేసినా పార్టీ నేతలు స్పందించకుండా ఉండాలని సూచించారు. అయితే ఆరోపణలు పదేపదే కొనసాగితే వాస్తవాలను చెప్పాల్సి వస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీలో ఎప్పటి నుంచీ వ్యక్తిగత ఆధిపత్యం కాకుండా టీమ్‌వర్క్ కొనసాగిందని సజ్జల తేల్చిచెప్పారు. జగన్ నిర్ణయాలపై ఆధారపడే వ్యక్తుల సమూహమే పార్టీ అనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. 2024 ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలినా పార్టీ సంస్థాగతంగా తిరిగి బలపడుతోందని చెప్పారు. జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సాయిరెడ్డి ఆరోపణలు జగన్ నాయకత్వం, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయలేవని సజ్జల ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.



# మోదీ బలహీనమైతే దేశ భద్రతకు ముప్పు

## బీజేపీ బలోపేతమే లక్ష్యం: ఎంపీ ఈటల

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ బలహీనపడితే ప్రజాస్వామ్యం, దేశ భద్రత కూడా బలహీనపడతాయని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. బీజేపీ కుటుంబ పార్టీ కాదని, సిద్ధాంతం ఆధారంగా పనిచేసే ప్రజా కేంద్రిత పార్టీ అని స్పష్టం చేశారు. దేశహితం కోసం నిర్ణయాలు తీసుకోవడమే పార్టీ లక్ష్యమన్నారు. బీజేపీ కార్యకర్తలే పార్టీకి పునాదిరాళ్లని, నాయకులు వస్తారు, పోతారు కానీ కార్యకర్తలు శాశ్వతంగా ఉంటారని చెప్పారు. మల్కాజిగిరి అత్యంత కీలకమైన నియోజకవర్గమని, ఈ ప్రాంతాన్ని మినీ ఇండియాగా అభివర్ణించారు. నాయకులు మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, దెబ్బల గాయాలు మానిపోతాయి కానీ మాటల గాయాలు మానవని ఈటల సూచించారు.

### రేవంత్‌పై విమర్శలు.. బీజేపీ గెలుపే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వంపై ఈటల తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి నిధులు అందిస్తున్న విషయాన్ని ప్రజలకు చెప్పకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే శక్తులు బీజేపీ వ్యతిరేక కార్యకలాపాలకు నిధులు అందిస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనపై విమర్శలు గుప్పించారు. డ్రగ్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాల అంశాల్లో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ భూముల సమస్యపై సెప్టెంబర్ 5న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరిలో బీజేపీని గెలిపించేందుకు శక్తిమేరకు పనిచేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం తాను ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేస్తూ, దేశం కోసం పనిచేయడమే తన లక్ష్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరాలని, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# గంజాయికి 'నో'.. ఈశ్వర్‌రెడ్డినగర్ ఫ్రీ

## మాదకద్రవ్యాలపై పోలీసుల అవగాహన సదస్సు



ప్రొద్దుటూరు: గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, ఈశ్వర్‌రెడ్డి నగర్‌ను గంజాయిరహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ పర్యవేక్షణలో ప్రొద్దుటూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో ఆదివారం మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారి ప్రవర్తనను గమనించాలని సూచించారు. ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో గంజాయి వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు భరోసా ఇచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులతో పాటు స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు, యువత భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

# అసలు వివాదం ఏంటి?



## 22 వేల కోట్ల క్లెయిమ్.. రికవరీ రూ.6.5 కోట్లు!

### సుభాష్ చంద్ర ఇన్సాల్వెన్సీపై అసలు కథ ఇదే

ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీ ఇచ్చిన ఓ రుణ వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్టీ) ఆగస్టు 25న సుభాష్ చంద్రకు సంబంధించిన ఇన్సాల్వెన్సీ కేసులో రీపేమెంట్ ప్లాన్‌కు ఆమోదం తెలిపింది. ఈ కేసు నేరుగా ఎస్సెల్ గ్రూప్ కంపెనీలపై కాదు. వివేక్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇచ్చిన సుమారు రూ.170 కోట్ల రుణానికి సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీదారుగా ఉన్నారు. రుణం తిరిగి చెల్లించకపోవడంతో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ తీసుకున్న చర్యలతో ఈ వ్యవహారం ఎన్‌సీఎల్టీ వరకు వెళ్లింది. అంటే కంపెనీ రుణానికి వ్యక్తిగత గ్యారంటీ ఇచ్చిన వ్యక్తిగా సుభాష్ చంద్రపై ఇన్సాల్వెన్సీ ప్రక్రియ కొనసాగింది.

**రూ.22 వేల కోట్ల క్లెయిమ్..**

**దక్కేది రూ.6.5 కోట్లు**

ఈ కేసులో రుణదాతలు, ఇతర క్రెడిటర్లు కలిపి రూ.22,006.57 కోట్ల మేర క్లెయిమ్‌లు సమర్పించారు. అయితే ఎన్‌సీఎల్టీ ఆమోదించిన ప్లాన్ ప్రకారం వారికి అందేది కేవలం రూ.6.25 కోట్లు మాత్రమే. ఇన్సాల్వెన్సీ ప్రక్రియ నిర్వహణ ఖర్చుల కోసం మరో రూ.25 లక్షలు కేటాయించారు. అంటే మొత్తం చెల్లింపు సుమారు రూ.6.5 కోట్లు. రూ.22 వేల కోట్లకు పైగా క్లెయిమ్‌లతో పోలిస్తే ఇది కేవలం 0.03 శాతం మాత్రమే. మరో మాటలో చెప్పాలంటే క్రెడిటర్లకు దాదాపు 99.97 శాతం నష్టం మిగిలే పరిస్థితి. రుణం ఇచ్చిన సంస్థలకు ఇది భారీ దెబ్బగా మారింది. ముఖ్యంగా ఆస్తుల విలువ తగ్గడం లేదా వాటిపై ఉన్న భద్రత సరిపోకపోవడం వల్ల రుణదాతలకు పూర్తి మొత్తాన్ని తిరిగి పొందే అవకాశం తగ్గుతుంది. అందుకే ఈ పరిష్కార ప్రణాళికపై కొందరు క్రెడిటర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వ్యతిరేకత.. కేసు ముందుకు?

ఈ రీపేమెంట్ ప్లాన్‌ను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా కొందరు క్రెడిటర్లు వ్యతిరేకించారు. ఇంత తక్కువ మొత్తంతో కేసును ముగించడం వల్ల తమకు భారీ నష్టం వస్తుందని వారు భావిస్తున్నారు. అందుకే ఎన్‌సీఎల్టీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అప్పీల్ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇక్కడ ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే.. రూ.22,006 కోట్ల క్లెయిమ్ ఉన్నప్పటికీ రూ.6.25 కోట్లే చెల్లించడం అంటే మొత్తం రుణం అంతా మాఫీ అయిందని అర్థం కాదు. ఇన్సాల్వెన్సీ చట్టం కింద వ్యక్తిగత హామీదారుడి నుంచి వాస్తవంగా ఎంత మొత్తాన్ని రికవర్ చేయగలమన్న దానిపై ఆధారపడి పరిష్కార ప్రణాళిక రూపొందుతుంది. ఈ కేసు ఎస్సెల్ గ్రూప్ కార్పొరేట్ సంస్థల దివాలా ప్రక్రియ కాదు. సుభాష్ చంద్ర వ్యక్తిగత గ్యారంటీకి సంబంధించిన ఇన్సాల్వెన్సీ కేసు మాత్రమే. అందుకే రూ.22 వేల కోట్ల క్లెయిమ్, రూ.6.5 కోట్ల రికవరీ మధ్య ఇంత భారీ వ్యత్యాసం కనిపిస్తోంది.



# నీట్ పీజీ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత

## పరీక్ష ప్రశాంత నిర్వహణకు అధికారుల చర్యలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: జిల్లాలో నీట్ పీజీ ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఫాతిమా విద్యాలయం, బీచీజజు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మధుసూదన్ నాయక్‌తో కలిసి ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రవేశ ద్వారాల వద్ద పోలీసుల విధులను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్ష సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, కేంద్రాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# భూసేకరణ వేగం పెంచండి

## సాగునీటి ప్రాజెక్టులపై కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: జిల్లాలో పురోగతిలో ఉన్న నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలు, కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం గద్వాల జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో భూసేకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల నిర్మాణ పనులకు భూసేకరణ కీలకమని, పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అవార్డు ప్రక్రియ పూర్తయిన రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్మును వెంటనే జమ చేయాలని స్పష్టం చేశారు. ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను మండలాల వారీగా, శాఖల వారీగా అధికారులు సమర్పించాలని ఆదేశించారు. సాగునీటి విడుదల విషయంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ప్రాజెక్టుల పనుల పురోగతికి ఎలాంటి అడ్డంకులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ భూసేకరణకు సంబంధించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్, ఎమ్మెల్యే సూచించారు. భూసేకరణ పూర్తయితే సాగునీటి ప్రాజెక్టుల పనులు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఈసారి ఎందుకు వద్దంటే?



**కాప్రా చెరువులో నో నిమజ్జనం**

**చెరువు కాదు.. నగరానికి సహజ రక్షణ**

**హైడ్రా నిర్ణయం వెనుక కారణమేంటంటే!?**

హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనాలపై ఏటా చర్చ జరుగుతున్నా, కాప్రా చెరువుకు ఈసారి మినహాయింపు ఎందుకు ఇచ్చారన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. దీనికి కారణం కేవలం నీటి కాలుష్యం కాదు. సుమారు 113 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాప్రా చెరువు కేంద్ర ప్రభుత్వం గుర్తించిన అర్బన్ వెట్‌ల్యాండ్ కావడం, నగర పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషించడమే ప్రధాన కారణం. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన సందర్భంగా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. చెరువు వరద నీటి నిల్వ, భూగర్భ జలాల పునఃభర్తీ, జీవ వైవిధ్య పరిరక్షణలో కీలకంగా పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 470కిపైగా వలస పక్షులకు కాప్రా చెరువు ఆవాసంగా ఉందని అధికారులు చెబుతున్నారు.

**పర్యావరణమే ముఖ్యం**

గణేశ్ నిమజ్జనాల వల్ల ఏర్పడే కాలుష్యం, నీటి నాణ్యతపై ప్రభావం, పక్షుల ఆవాసానికి కలిగే ముప్పు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని కాప్రా చెరువులో నిమజ్జనాలను అనుమతించకూడదని హైడ్రా నిర్ణయించింది. గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో రంగనాథ్ మాట్లాడి, చెరువు సహజ స్వరూపాన్ని కాపాడేందుకు సహకరించాలని కోరారు. చిన్న విగ్రహాలకు చెరువు పక్కన ఉన్న బేబీ పాండ్‌ను ఉపయోగించుకోవచ్చని సూచించారు. పెద్ద విగ్రహాలకు ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. కాప్రా చెరువు అభివృద్ధిలో సుమారు 70% భూమి ప్రైవేట్ పట్టా భూమిగా ఉన్నా, భూయజమానులు పునరుద్ధరణ పనులకు సహకరించేందుకు ముందుకు రావడాన్ని హైడ్రా అభినందించింది. వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ నిబంధనల ప్రకారం చెరువు హద్దుల నిర్ధారణ, ఆక్రమణల నివారణ, కాలుష్య నియంత్రణ తప్పనిసరని అధికారులు చెబుతున్నారు. ఈ నిర్ణయ ఈ ఏడాది గణేశ్ నిమజ్జనాలకే పరిమితం కాదు. కాప్రా చెరువును భవిష్యత్ హైదరాబాద్‌కు పర్యావరణ రక్షణ కవచంగా నిలబెట్టాలన్న ప్రణాళికలో భాగంగానే నిమజ్జనాల కు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారన్నది అసలు విషయం.



కలియుగానికి కాలజ్ఞానం చెప్పిన పుణ్యక్షేత్రం అది. భవిష్యత్తు ఎలా ఉండబోతుందో లోకానికి చెప్పిన మహాయోగి నడయాడిన నేల అది. వైరాగ్యాన్ని బోధించిన మహాత్ముడి జీవసమాధి ఉన్న పవిత్ర ప్రదేశం అది. కుటుంబ బంధాలకు అతీతంగా మానవత్వాన్ని, ధర్మాన్ని, సత్యాన్ని బోధించిన బ్రహ్మంగారి పీఠం అది. అలాంటి పవిత్రమైన పీఠంలో ఇప్పుడు వినిపిస్తున్నది మంత్రోచ్చారణ కాదు... ఒక తల్లి కన్నీటి శబ్దం. ఆమె పేరు మారుతీ మహాలక్ష్మమ్మ. ఆమె ఎవరో బయటి వ్యక్తి కాదు. నిన్న మొన్న వచ్చిన మహిళ కాదు. బ్రహ్మంగారి పీఠాధిపత్యాన్ని సుదీర్ఘకాలం నిర్వహించిన శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామివారి ధర్మపత్ని. పీఠాన్ని ఆశ్రయించిన భక్తులకు గురుపత్నిగా, అమ్మగా పరిచయమైన మహిళ. ఇప్పుడు అదే అమ్మ తనకు ఎన్నో ఏళ్లుగా నిలయమైన చోటే ఒక చిన్న గదిలో పిల్లలతో కలిసి ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని కన్నీటితో చెబుతున్నారు. ఇది కేవలం ఒక కుటుంబ వివాదమా..? ఒక పీఠాధిపత్య వివాదమా..? లేక ఒక తల్లి గౌరవానికి సంబంధించిన ప్రశ్నా..? భక్తుల మనసుల్లో మాత్రం ఒక్కటే ప్రశ్న. "అమ్మకు చోటు లేని పీఠం ఏ పీఠం?"

## పీఠం నిలిచినా.. అమ్మ కన్నీరు ఆగేదెలా?

ఇది కేవలం మారుతీ మహాలక్ష్మమ్మ కన్నీటి కథ కాదు. ఇది ఒక తల్లి కథ. ఇది ఒక గురుపత్ని కథ. ఇది ఒక కుటుంబంలో పుట్టిన వివాదం కథ. ఇది వారసత్వం కోసం సాగుతున్న పోరాటం కథ. అంతకంటే ముఖ్యంగా మానవత్వం ఎక్కడ నిలబడాలి అన్న ప్రశ్న. పీఠాధిపత్యం ఎవరికి దక్కిందన్నది చరిత్ర రాస్తుంది. కోర్టులు హక్కులు నిర్ణయిస్తాయి. మత నిబంధనలు వ్యవస్థను నడిపిస్తాయి. కానీ ఒక తల్లిని ఎలా చూసామన్నది మాత్రం మనుషుల మనసుల్లో నిలిచిపోతుంది. ఈరోజు మారుతీ మహాలక్ష్మమ్మ కన్నీళ్లు పెడుతున్నారు. రేపు ఆ కన్నీళ్లు ఆగిపోవచ్చు. వివాదాలు కూడా ఏదో ఒకరోజు ముగియవచ్చు. కోర్టులు తీర్పులు చెప్పవచ్చు. పీఠాధిపత్యం కూడా స్థిరపడవచ్చు. కానీ ఒక ప్రశ్న మాత్రం మిగిలిపోతుంది. బ్రహ్మంగారి పీఠం తన పీఠాన్ని కాపాడుకుందా, లేక ఆ పీఠానికి ప్రాణమైన మానవత్వాన్ని కాపాడుకుందా? పీఠాధిపతి స్థానం ఎంత పవిత్రమైనదో అమ్మ స్థానం అంతకంటే పవిత్రమైనది. పీఠం మీద కూర్చున్నవాడిని భక్తులు స్వామిగా పిలవొచ్చు. కానీ అమ్మను మాత్రం ఎప్పటికీ అమ్మగానే పిలుస్తారు. ఆ పిలుపును గౌరవించడమే బహుశా బ్రహ్మంగారి పీఠానికి నిజమైన నివాళి. పీఠం కోసం పోరాడవచ్చు. హక్కుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. వారసత్వం కోసం వాదించవచ్చు. కానీ ఒక తల్లి కన్నీటి ముందు ఒక్కసారి ఆగి చూడాలి. ఎందుకంటే పీఠాలు తరాలు మారినా ఉంటాయి. పదవులు మారినా ఉంటాయి. గదులు మారినా ఉంటాయి. కానీ అమ్మ కన్నీరు మాత్రం ఆ పీఠం చరిత్రలో చెరిగిపోని మచ్చగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఇప్పుడు ప్రశ్న పీఠం ఎవరిది అనేది కాదు. అమ్మకు ఆ పీఠంలో గౌరవంగా నిలబడే స్థానం ఉందా లేదా అన్నదే అసలు ప్రశ్న.

# మఠంలో ముఠాలు

## అమ్మను గెంటేస్తారా..?

## అమ్మను మించిన పీఠం ఏది..?

## బ్రహ్మంగారి పీఠంలో ఓ తల్లి కన్నీటి కథ



బ్రహ్మంగారు 1610 ప్రాంతంలో జన్మించినట్టు సంప్రదాయ ఆధారాలు చెబుతున్నాయి. చిన్ననాటి నుంచి పాపాగ్ని మఠం, బనగానపల్లె ప్రాంతాల్లో గడిపి, దేశ సంచారం అనంతరం కందిమల్లాయపల్లెలో స్థిరపడ్డారని ప్రసిద్ధి. అక్కడ వడ్రంగిగా జీవితం ప్రారంభించి, జమ్మలమడుగు మైలవరం మండలం పెద్దకొమెర్లకు చెందిన గోవిందమ్మను వివాహం చేసుకున్నారు. దూదేకుల సిద్దయ్య, కక్కయ్య వంటి శిష్యులను స్వీకరించారు. ఒక సాధారణ జీవితం నుంచి అసాధారణ ఆధ్యాత్మిక శిఖరానికి ఎదిగిన మహాయోగి ఆయన. కాలం ఆయన శరీరాన్ని తీసుకెళ్లినా ఆయన ఆలోచనలు మిగిలిపోయాయి. వైశాఖ శుద్ధ దశమి నాడు క్రీ.శ. 1693లో, 85 ఏళ్ల వయసులో జీవసమాధి పొందినట్టు కడప జిల్లా గెజిట్‌లో నమోదైందని చెబుతున్నారు. కొన్ని ఆధారాల్లో 1694గా ప్రస్తావన ఉన్నప్పటికీ 1693నే అధికారిక నమోదుగా పేర్కొంటున్నారు. ఆయన జీవసమాధిపైనే కందిమల్లాయపల్లెలో మఠం ఏర్పడింది. అది కేవలం ఒక భవనం కాదు. ఒక ఆధ్యాత్మిక వారసత్వానికి చిరునామా. ఒక విశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం. ఒక తత్వానికి జీవంతమైన ప్రతీక. బ్రహ్మంగారి జీవితం గురించి మాట్లాడేటప్పుడు మనం తరచుగా కాలజ్ఞానాన్ని గుర్తు చేసుకుంటాం. కానీ ఆయన జీవితంలో ఉన్న మరో గొప్ప విలువను ఎంతమంది గుర్తు చేసుకుంటారు? కుటుంబాన్ని, స్త్రీని, తల్లిని. బ్రహ్మంగారికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఈశ్వరమ్మ ఉన్నారని సంప్రదాయం చెబుతోంది. ఆయన అనంతరం పీఠ వారసత్వం విషయంలో కుమార్తె సంతతికి ప్రాధాన్యం లభించిందనే విశ్వాసం ఉంది. ఇక్కడే ఒక గొప్ప సందేశం కనిపిస్తుంది. ఆధ్యాత్మిక పీఠం అంటే కేవలం పురుషాధికారం కాదని, వంశం అంటే కేవలం కొడుకు ద్వారా కొనసాగేది కాదని, కూతురు కూడా వంశానికి వారసురాలేనని బ్రహ్మంగారి సంప్రదాయం చెబుతున్నట్టుగా భక్తులు భావిస్తారు. అంటే ఆ పీఠ సంప్రదాయంలో స్త్రీకి, అమ్మకు, మాతృత్వానికి ఒక ప్రత్యేక స్థానం ఉన్నట్టే. అలాంటి పీఠంలో ఇప్పుడు ఒక తల్లి కన్నీరు పెట్టుకోవాల్సి వస్తే అది కేవలం ఒక కుటుంబం బాధ కాదు. ఒక సంప్రదాయం మనసును ప్రశ్నించే సందర్భం.

### వారసత్వ పోరులో అమ్మకు చోటేది?

శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామివారు 2021 మే 21న అనారోగ్య కారణాలతో శివైక్యం చెందారని చెబుతున్నారు. ఆ తర్వాత పీఠాధిపత్యం విషయంలో వారసత్వ వివాదం మొదలైంది. తొలి భార్య చంద్రావతమ్మ సంతానమైన శ్రీ వెంకటాద్రి స్వామి, రెండో కొడుకు శ్రీ వీరభద్ర స్వామి, రెండో భార్య మారుతీ మహాలక్ష్మమ్మ కుమారుడు గోవిందస్వామి పేర్లు ఈ వివాదంలో వినిపించాయి. పీఠాధిపతి ఎవరు కావాలి, వారసుడు ఎవరు, వంశపారంపర్య హక్కు ఎవరిది అనే ప్రశ్నలు చివరకు కుటుంబం గోడలు దాటి బయటకు వచ్చాయి. గ్రామస్తులు వచ్చారు. రాజకీయ నాయకులు వచ్చారు. పోలీసులు వచ్చారు. కోర్టులు వచ్చాయి. ఒకప్పుడు మంత్రాలు వినిపించిన చోట వివాదాల మాటలు వినిపించాయి. ఒకప్పుడు భక్తులు తలవంచిన చోట హక్కుల కోసం వాదనలు వినిపించాయి. దాదాపు నాలుగేళ్ల పాటు పీఠాధిపతి లేకుండానే ఫిట్ పర్సన్, మేనేజర్ ఆధ్వర్యంలో మఠ వ్యవహారాలు కొనసాగాయని చెబుతున్నారు. చివరకు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామివారు ఎనిమిదో తరానికి చెందిన 12వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. ఒక దశలో ముగిసినట్టనిపించిన వివాదం ఇప్పుడు మరో రూపంలో మళ్లీ ముందుకు వచ్చింది. ఇక్కడే అసలు ప్రశ్న. పీఠాధిపత్య వివాదంలో ఎవరు గెలిచారన్నది ఒక అంశం. కానీ ఒక తల్లి ఎక్కడ నిలబడాలి అన్నది మరో అంశం. మారుతీ మహాలక్ష్మమ్మ రెండో భార్యగా 2006 ఫిబ్రవరి 19న శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామివారిని వివాహం చేసుకున్నారని వివరాలు చెబుతున్నాయి. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో గోవిందస్వామి వేద విద్యను అభ్యసిస్తూ, తండ్రి వద్ద నుంచి వేద పారాయణం, బ్రహ్మంగారి తత్వబోధనలు నేర్చుకున్నారని చెబుతున్నారు. భర్త ఉన్నంతకాలం ఆమెకు పీఠంలో ఒక స్థానం ఉంది. భక్తుల మధ్య ఆమెకు ఒక పరిచయం ఉంది. గురుపత్ని, అమ్మ, మాతృమూర్తి అనే గౌరవం ఉంది. అయితే భర్త పరమపదించిన తర్వాత అదే స్థానం ఎందుకు మారాలి? పీఠాధిపతి మారితే తల్లి స్థానం కూడా మారిపోవాలా? వంశపారంపర్య పీఠంలో వారసత్వం కోసం న్యాయపోరాటం ఉండవచ్చు. కానీ మాతృత్వానికి కూడా కోర్టు తీర్పు అవసరమా?

### పీఠం నిబంధనలకంటే అమ్మ కన్నీళ్లే గొప్ప

మారుతీ మహాలక్ష్మమ్మ వాదన ప్రకారం, తాను నివసిస్తున్న గదిని ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు జరిగాయని, ఆధునికీకరణ పేరుతో గది ఫ్లోరింగ్‌ను తొలగించినా ఇప్పటివరకు మరమ్మతులు పూర్తి కాలేదని ఆమె చెబుతున్నారు. తాను ఉంటున్న గదిలో దాతలు ఇచ్చిన బియ్యం తదితర వస్తువుల బస్తాలు ఉంచారని, ప్రస్తుతం పిల్లలతో కలిసి ఒక చిన్న గదిలో ఉంటున్నానని వాపోతున్నారు. ఈ ఆరోపణలు నిజమా, వాస్తవ పరిస్థితి ఏమిటి, ఎవరెంత బాధ్యత వహించాలి అనే విషయాలు సంబంధిత పక్షాలు, మఠ నిర్వాహకులు, అధికారులు వివరణలతో స్పష్టమవ్వాల్సిన అంశాలే. కానీ ఒక దృశ్యం మాత్రం మనసును కదిలిస్తుంది. ఒకప్పుడు వందలాది భక్తులకు అమ్మగా కనిపించిన మహిళ ఇప్పుడు తనకు తలదాచుకునే చోటు కోసం కన్నీరు పెట్టుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇది ఎంతటి విరుద్ధ దృశ్యం. కాలజ్ఞానం రాసిన పీఠంలో ఒక తల్లి తన భవిష్యత్తు గురించి భయపడే పరిస్థితి రావడం ఎంతటి విషాదం. ఇక్కడ మరో సున్నితమైన విషయం ఉంది. మఠానికి నిబంధనలు ఉండవచ్చు. పీఠానికి ఆచారాలు ఉండవచ్చు. ఆస్తులకు నిర్వహణ నియమాలు ఉండవచ్చు. పీఠాధిపత్యానికి వారసత్వ విధానాలు ఉండవచ్చు. అన్నీ ఉండాలి. కానీ వాటన్నింటి కంటే ఒకటి ఉండాలి. మానవత్వం. ఒక వ్యక్తికి ఆస్తిపై హక్కు ఉందా లేదా అన్నది చట్టం నిర్ణయిస్తుంది. ఒకరికి పీఠంపై హక్కు ఉందా లేదా అన్నది సంప్రదాయం, నిబంధనలు, న్యాయస్థానాలు నిర్ణయిస్తాయి. కానీ ఒక తల్లిని గౌరవంగా చూడాలా వద్దా అన్నది మాత్రం మనిషి మనసు నిర్ణయించాలి. ఒక తల్లి స్థానాన్ని కేవలం పీఠాధిపత్య హక్కులు, ఆస్తి హక్కులు, నిర్వహణ నిబంధనలతో కొలవలేమని భక్తులు భావిస్తున్నారు. మారుతీ మహాలక్ష్మమ్మ ప్రస్తుత పీఠాధిపతి తండ్రి భార్య. ఆమెకు, ప్రస్తుత పీఠాధిపతికి రక్త సంబంధం లేకపోయినా కుటుంబ బంధం ఉంది. ఒకే ఇంటి నీడలో జీవించిన బంధం ఉంది. తండ్రితో కలిసి జీవించిన మరో తల్లి అనే భావన ఉంది. అందుకే భక్తులు ఒక ప్రశ్న అడుగుతున్నారు. "తల్లి లేని కొడుకుకు సవతి తల్లి తల్లే కాదా?" జీవితం అంత సులభమైన గణితం కాదు. రక్తసంబంధాలు కొన్నిసార్లు దూరం చేస్తాయి. రక్తసంబంధం లేని మనుషులు కొన్నిసార్లు తల్లిదండ్రులుగా మారిపోతారు. ఒక పిల్లవాడి బాల్యంలో అతనికి అన్నం పెట్టిన చేయి ఎవరిదైనా ఆ చేయి తల్లి చేతే. ఒక పిల్లవాడిని మందలించిన గొంతు ఎవరిదైనా ఆ శబ్దంలో తల్లితనం ఉండొచ్చు. అలాంటి బంధాలను పీఠాధిపత్య వివాదాల కొలమానంతో కొలవడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న ఇప్పుడు ముందుకొస్తోంది.

### పీఠాధిపత్యం కాదు.. మానవత్వమే నిజమైన వారసత్వం

ఈ పీఠం సాధారణ మఠం కాదు. బ్రహ్మంగారి పేరు అంటే కాలజ్ఞానం. కాలజ్ఞానం అంటే భవిష్యత్తు. భవిష్యత్తు గురించి చెప్పిన మహాయోగి పీఠం నుంచి వర్తమానానికి ఏ సందేశం వెళ్లాలి? "బలవంతుడిదే న్యాయం" అనా? "పీఠం ఉన్నవాడిదే హక్కు" అనా? లేక "మానవత్వం అన్నింటికంటే గొప్పది" అనా? భక్తులు కోరేది మూడో సందేశమే. పీఠాధిపత్యం ఎవరికి దక్కినా మారుతీ మహాలక్ష్మమ్మ గౌరవం తగ్గకూడదని వారు కోరుతున్నారు. వివాదాలు కోర్టుల్లో ఉండొచ్చు. హక్కుల పోరాటం న్యాయస్థానాల్లో సాగొచ్చు. కానీ ఒక తల్లి గౌరవం మాత్రం కోర్టు తీర్పు కోసం ఎదురు చూడకూడదని వారి భావన. భక్తులు మఠానికి ఎందుకు వస్తారు? కేవలం దర్శనం కోసం కాదు. శాంతి కోసం, ఆశ కోసం, ఆధ్యాత్మికత కోసం, అమ్మ ఆశీర్వాదం కోసం. అలాంటి భక్తుల ముందు ఒక గురుపత్ని కన్నీరు పెడితే ఆ కన్నీటి అర్థం ఏమిటి? ఆమె తప్పు చేసి ఉంటే చట్టం ఉంది. ఆమెకు హక్కు లేకపోతే నిబంధనలు ఉన్నాయి. ఆమెకు పీఠంలో స్థానం లేకపోతే సంప్రదాయం తన నిర్ణయం చెబుతుంది. కానీ ఆమెను అవమానించాల్సిన అవసరం ఎక్కడుంది? ఆమెకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? ఆమె వయసు, ఆమె స్థానం, ఆమె మాతృత్వాన్ని గౌరవించాల్సిన బాధ్యత ఎవరిది? ఇవే ఇప్పుడు భక్తజనం అడుగుతున్న ప్రశ్నలు. ఒక పీఠం గొప్పది అవుతుంది. దాని మీద కూర్చున్న వ్యక్తి వల్ల మాత్రమే కాదు. ఆ పీఠం నిలబెట్టిన విలువల వల్ల. బ్రహ్మంగారి పీఠం గొప్పదైతే అది కేవలం శతాబ్దాల చరిత్ర వల్ల కాదు. ఆయన బోధించిన తత్వం వల్ల. ఆయన జీవించిన నిష్ఠ వల్ల. ఆయన చూపిన ధర్మమార్గం వల్ల. ఆయన పేరుతో నడుస్తున్న పీఠంలో ఒక తల్లి కన్నీరు పెట్టుకుంటే ఆ కన్నీరు తుడిచే మనిషే నిజమైన వారసుడు. పీఠంపై కూర్చోవడం వారసత్వం కావచ్చు. పీఠం విలువలను కాపాడటం మాత్రం సాధన.

### అమ్మ కోరేది పీఠం కాదు.. గౌరవమైన జీవితం

మారుతీ మహాలక్ష్మమ్మకు పీఠాధిపత్యం కావాలని మాత్రమే ఆమె పోరాడుతున్నారని చెప్పలేం. ఆమె కుమారుడి వారసత్వ హక్కు కోసం న్యాయపోరాటం కొనసాగుతోందని సమాచారం. అది ఒక న్యాయపరమైన అంశం. కానీ ఆమె వ్యక్తిగతంగా కోరుకునేది ఏమిటి? తన జీవితాన్ని గడిపిన చోట తనకు గౌరవంగా జీవించే అవకాశం. ఒక మనిషి జీవితాంతంలో కోరుకునే అత్యంత చిన్న కోరిక అదే. తలదాచుకునే నాలుగు గోడలు, కాస్త గౌరవం, కాస్త ప్రశాంతత, తన పిల్లలతో ఉండే ఒక సురక్షితమైన స్థలం. అది కూడా ఎక్కువ కోరికేనా అనే ప్రశ్న భక్తుల మనసులను వేధిస్తోంది. బ్రహ్మంగారు కాలాన్ని చూశారు. కలియుగంలో ఎన్నో మార్పులు వస్తాయని చెప్పారు. సమాజం మారుతుంది. మనుషుల విలువలు మారుతాయి. బంధాలు మారుతాయి. అధికారం కోసం పోరాటాలు పెరుగుతాయి. అయితే మనిషి చివరకు వెతికేది ఒక్కటే. మనిషిని మనిషిగా చూసే మనసు. ఈరోజు బ్రహ్మంగారి పీఠం ముందు నిలబడిన ప్రశ్న కూడా అదే. పీఠం ఎవరిది అనేది ఒక ప్రశ్న. వారసుడు ఎవరు అనేది మరో ప్రశ్న. కానీ అమ్మ ఎవరు అనే ప్రశ్నకు సమాధానం మాత్రం అందరికీ తెలుసు. అమ్మ అంటే ఆశ్రయం. అమ్మ అంటే క్షమ. అమ్మ అంటే కరుణ. అమ్మ అంటే త్యాగం. అమ్మ అంటే మనిషి జీవితానికి మొదటి దేవాలయం. ఒక క్షణం ఊహించుకుందాం. బ్రహ్మంగారు స్వయంగా ఆ మఠంలో నిలబడి ఈ పరిణామాన్ని చూస్తున్నారని. ఒకవైపు తన పీఠాధిపత్య వారసత్వం, మరోవైపు తన పీఠంలో కన్నీరు పెడుతున్న ఒక తల్లి. ఆయన ఏమని చెప్పేవారు? "పీఠం కాపాడు" అని మాత్రమే చెప్పేవారా? లేక "ముందు మనిషిని కాపాడు" అని చెప్పేవారా? ఇదే భక్తుల మనసులో మెదులుతున్న మౌన ప్రశ్న. బ్రహ్మంగారి పేరు మీద ఉన్న పీఠానికి ప్రపంచం నుంచి భక్తులు వస్తారు. వాళ్లు ఇక్కడికి వస్తున్నది ఆధ్యాత్మిక శాంతి కోసం. వాళ్లు చూస్తున్నది పీఠాధిపతిని మాత్రమే కాదు. బ్రహ్మంగారి వారసత్వాన్ని. ఆ వారసత్వంలో ఒక తల్లికి గౌరవం లేకపోతే భక్తుల హృదయం బాధపడటం సహజం.

## ఇంకా చాలా ఉంది!

### అమ్మను గెంటేస్తారా..?

బ్రహ్మంగారి పీఠంలో తల్లి కన్నీటి కథ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పీఠాధిపత్యాన్ని సుదీర్ఘకాలం నిర్వహించిన శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామివారి ధర్మపత్ని మారుతీ మహాలక్ష్మమ్మ.. భర్త మరణం తర్వాత తాను నివసిస్తున్న చోటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని చెబుతున్నారు. పిల్లలతో కలిసి చిన్న గదిలో ఉంటున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వారసత్వ వివాదమే అసలు కారణం

2021లో పీఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామివారు శివైక్యం చెందిన తర్వాత వారసత్వ వివాదం మొదలైంది. తొలి భార్య సంతానం, రెండో భార్య మారుతీ మహాలక్ష్మమ్మ కుమారుడి మధ్య పీఠాధిపత్య హక్కులపై వివాదం కొనసాగింది. పీఠాధిపతి ఎవరు కావాలి, వారసత్వ హక్కు ఎవరికి దక్కాలి అనే అంశాలు కుటుంబాన్ని దాటి న్యాయపోరాటానికి చేరాయి.

### పీఠం చరిత్రలో స్త్రీకి ప్రత్యేక స్థానం

కలియుగానికి కాలజ్ఞానం చెప్పిన బ్రహ్మం గారి జీవసమాధిపై ఏర్పడిన ఈ పీఠానికి శతాబ్దాల ఆధ్యాత్మిక వారసత్వం ఉంది. బ్రహ్మం గారికి కుమార్తె ఈశ్వరమ్మ కూడా ఉన్నారని సంప్రదాయ ఆధారాలు చెబుతున్నాయి. ఆమె సంతతికి పీఠ వారసత్వంలో ప్రాధాన్యం లభించిందనే విశ్వాసం ఉంది. అందుకే ఈ పీఠంలో తల్లి, స్త్రీ, మాతృత్వానికి గౌరవం ఉండాలనే భావన భక్తుల్లో బలంగా ఉంది.

### హక్కులు వేరే.. మానవత్వం వేరే

మారుతీ మహాలక్ష్మమ్మ ఆరోపణలపై వాస్తవాలు సంబంధిత పక్షాలు, మఠ నిర్వాహకులు, అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. అయితే పీఠాధిపత్యం, ఆస్తి, వారసత్వ హక్కులు చట్టపరమైన అంశాలైనా.. ఒక తల్లిని గౌరవంగా చూడటం మానవత్వానికి సంబంధించిన విషయమని భక్తులు అంటున్నారు. వివాదం ఏదైనా ఆమెకు భద్రత, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

### అసలు పరీక్ష.. పీఠం విలువలదే

పీఠాధిపతి ఎవరు అన్నది సంప్రదాయం, న్యాయస్థానాలు నిర్ణయించవచ్చు. వారసత్వ హక్కులు కూడా చట్టపరంగా తేలవచ్చు. కానీ పీఠం తన ఆధ్యాత్మిక విలువలను ఎంతగా కాపాడుతుందన్నదే అసలు ప్రశ్న. బ్రహ్మంగారి పీఠంలో ఒక తల్లి కన్నీరు ఆగితేనే మానవత్వం గెలిచినట్లని భక్తులు భావిస్తున్నారు. పీఠం కోసం పోరాటం ఉండొచ్చు.. అమ్మ గౌరవంపై రాజీ ఉండకూడదన్నదే వారి సందేశం.















# డీవీ మనోహర్ హిస్టరీ... అసామాన్య విక్టరీ

## చేనేత కుటుంబంలో చరిత్రకారుడు

**అందనంత ఎత్తుకెదిగిన అసామాన్యుడు**

**దేశం కోసం సైకిల్ తొక్కిన మనోహరుడు**

**వ్యాపారం నుంచి సామాజిక బాధ్యత వరకు**

**చిన్న పరిశ్రమ నుంచి జాతీయ విధానం వరకు**

**మూలాలను మరవని దేవాంగ ధీరుడు**

**విజయగర్వం తలకెక్కని చేతల విధేయుడు**




చేతిలో డబ్బుల్లేవు. పెట్టుబడులు లేవూ. కానీ ఏదో సాధించాలనే సంకల్పం మాత్రం ఆయనను ముందుకు నడిపించింది. అందుకే, చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం కాకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేశారు డీవీ మనోహర్. పారిశ్రామికవేత్తగా ఎదగాలనే తపనతో 1975లో స్వయం ఉపాధి పథకం కింద స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ నుంచి రూ.62 వేల రుణం, తల్లిదండ్రుల నుంచి మరో రూ.10 వేల సాయంతో చిన్న కుటీర పరిశ్రమను ప్రారంభించారు. అక్కడి నుంచి డీప్‌వెల్ హ్యాండ్‌పంపుల తయారీతో వ్యాపార ప్రస్థానాన్ని మొదలుపెట్టి, అనంతరం ఎల్పీజీ రంగంలోకి ప్రవేశించారు. శక్తి గ్యాస్ సంస్థను స్థాపించి దేశంలోని ప్రముఖ ప్రైవేట్ ఎల్పీజీ సంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దారు. హోటల్ రంగంలోనూ అడుగుపెట్టి లగ్జరీ హోటళ్లను అభివృద్ధి చేశారు. ఇలా ఒక్కో రంగంలో తనదైన ముద్ర వేస్తూ ఎదిగిన ఆయన ప్రయాణం చివరకు స్మార్ట్ అండ్ సస్టైనబుల్ మొబిలిటీ వైపు మళ్లింది. ఆరోగ్య సమస్యల సమయంలో వైద్యుల సూచనతో దాదాపు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత మళ్లీ సైకిల్ ఎక్కిన మనోహర్, ప్రారంభంలో ఎదురైన కష్టాలను అధిగమించి లండన్-పారిస్ సైక్లింగ్ సవాలును పూర్తి చేశారు. ఆ అనుభవం ఆయనను అంతర్జాతీయ సైక్లింగ్ వేదికపైకి తీసుకెళ్లింది. అక్కడి నాయకత్వ అనుభవాన్ని భారతదేశానికి తీసుకొచ్చి పబ్లిక్ బైక్ షేరింగ్, స్మార్ట్‌బైక్ వ్యవస్థల విస్తరణకు కృషి చేశారు. సైక్లింగ్‌ను ఆరోగ్యానికే పరిమితం చేయకుండా కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన రవాణాకు కీలక సాధనంగా భావించి జాతీయ సైక్లింగ్ విధాన రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. వ్యాపార విజయాన్ని దాటి సమాజ ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను జీవిత ధ్యేయంగా ఎంచుకున్న మనోహర్ ప్రస్థానం సంకల్పం ఉంటే సాధారణ ఆరంభం నుంచే అసాధారణ మార్పుకు బాటలు వేయవచ్చని నిరూపిస్తోంది.



### వ్యక్తిగత అనుభవమే సైక్లింగ్‌కు కారణం

స్మార్ట్‌బైక్ ఆలోచన వెనుక ఒక వ్యక్తిగత అనుభవం ఉందని మనోహర్ చెబుతారు. సుమారు 15 ఏళ్ల క్రితం ఆరోగ్య సమస్యలు ఎదురైన సమయంలో వైద్యులు పని ఒత్తిడి తగ్గించుకోవాలని సూచించారు. అయితే పని లేకుండా ఉండటం తన వల్ల కాదని నిర్ణయించుకున్న ఆయన సైక్లింగ్‌పై పరిశోధన చేశారు. సైక్లింగ్ శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా జీవనశైలికి సంబంధించిన సమస్యలను నియంత్రించడంలో ఉపయోగపడుతుందని తెలుసుకుని, సుమారు 55 ఏళ్ల వయసులో దాదాపు 40 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ సైకిల్ ఎక్కారు. సైక్లింగ్ ప్రారంభించిన రోజునే సైకిల్‌పై నుంచి పడిపోయానని మనోహర్ చెప్తారు. ఆ నాడే.. తాను ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నారు. లండన్ నుంచి పారిస్ వరకు సైకిల్‌పై వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇది ప్రపంచంలోని కఠినమైన సైక్లింగ్ మార్గాల్లో ఒకటిగా ఆయన పేర్కొన్నారు. వ్యాపార బాధ్యతలు కొనసాగిస్తూనే ప్రతిరోజూ తెల్లవారుజామున నాలుగు గంటలకు లేచి సాధన ప్రారంభించానని ఆయన గుర్తు చేస్తారు. మొదట 20 కిలోమీటర్లు, తర్వాత 30, 50, 100 కిలోమీటర్లు దిశగా సాధన చేశారు. లండన్-పారిస్ ప్రయాణంలో రోజుకు సుమారు 150 కిలోమీటర్లు సైక్లింగ్ చేయాల్సి ఉండటంతో, తొమ్మిది నెలల్లో ఆ గోల్ రీచ్ అయ్యారు. కుటుంబ సభ్యులు కూడా ఆయనకు తోడుగా సైక్లింగ్ చేపట్టారు. భార్య ఎస్కార్ట్ కారులో వెంట నడవగా.. కొడుకు, కుమార్తె సాయంతో ఆ సవాలును విజయవంతంగా పూర్తి చేయడంతో, తనకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిందంటారు.

### ఆసియా నుంచి తొలిసారి అవకాశం

60 ఏళ్లు పూర్తయ్యే సమయంలో మరోసారి తన శారీరక సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈసారి తీవ్ర వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా సైక్లింగ్‌ను ఆపలేదు. ఆ సవాలును కూడా విజయవంతంగా పూర్తి చేయడంతో అంతర్జాతీయ సైక్లింగ్ వర్గాల్లో ఆయనకు మరింత గుర్తింపు తెచ్చింది. అంతర్జాతీయ సైక్లింగ్ రంగంలో ఆయనకు వరల్డ్ సైక్లింగ్ అలయన్స్‌లో బోర్డు సభ్యుడిగా అవకాశం లభించింది. ఆసియా నుంచి ఆ స్థానాన్ని పొందిన తొలి వ్యక్తిగా నిలిచానని మనోహర్ గర్వంగా చెబుతారు. ఆ తర్వాత వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్‌గా, అనంతరం తొలి ఉపాధ్యక్షుడిగా ఎదిగారు. నాలుగేళ్లుగా ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు మనోహర్. ఈ బాధ్యతల్లో పనిచేస్తున్న సమయంలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో సైక్లింగ్ అభివృద్ధి తీరును దగ్గరగా పరిశీలించే అవకాశం లభించిందన్నారు.

### సైకిల్ వెనుక అసలు లక్ష్యం

అంతర్జాతీయ అనుభవంతో భారతదేశంలోనూ సైక్లింగ్‌ను భారీగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందనే ఆలోచన బలపడిందని మనోహర్ చెప్పారు. ఒకవైపు సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని... మరోవైపు వాహనాల కాలుష్యాన్ని తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని కుండబద్ధలుకొడతారు. నగరాల్లో వాయు కాలుష్యం ప్రజల ఆయుష్షును గణనీయంగా తగ్గిస్తోందన్న అధ్యయనాలను పరిశీలించిన తర్వాత ఈ అంశాన్ని తన సామాజిక బాధ్యతగా తీసుకున్నానని తెలిపారు. ఆయన సమర్పించిన జాతీయ సైక్లింగ్ విధాన ముసాయిదాలో కూడా కాలుష్యం, ఆరోగ్యం, స్థిరమైన రవాణా అంశాలకు ప్రధాన ప్రాధాన్యం ఇచ్చారు. సైక్లింగ్‌ను ప్రజల రోజువారీ రవాణాలో భాగం చేయాలంటే సైకిళ్లు అందుబాటులో ఉండాలని భావించిన మనోహర్ పబ్లిక్ బైక్ షేరింగ్ సిస్టమ్‌ను భారత్‌లో ప్రవేశపెట్టేందుకు కృషి చేశారు. కొత్త కాన్సెప్ట్ కావడంతో మొదట్లో బ్యాంకులు, ఫండింగ్ సంస్థలు ముందుకు రాలేదని చెప్పారు. దీంతో సొంత నిధులతో ఢిల్లీ, చెన్నై, చండీగఢ్, హైదరాబాద్ వంటి నగరాల్లో ఈ వ్యవస్థను ప్రారంభించనన్నారు. అనంతరం రక్షణ రంగం కూడా ఈ విధానాన్ని అమలు చేసిందన్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఈ కార్యక్రమాన్ని అభినందించి ప్రారంభించారని మనోహర్ తెలిపారు. అనంతరం నేవీకి చెందిన ఐఎన్ఎస్ ఇండియా, ఢిల్లీలోని డిఫెన్స్ వ్యవస్థకు చెందిన సంస్థలు, కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్, మిలిటరీ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రక్షణ వ్యవస్థల్లోనూ స్మార్ట్‌బైక్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు.




### కాశీ నుంచి విశాఖ వరకు విస్తరణ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 10 వేల స్మార్ట్ బైక్‌లు ఉన్నాయని మనోహర్ తెలిపారు. సాధారణ సైకిళ్ల కంటే ఆధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ బైక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. స్మార్ట్ బైక్‌ను ఉపయోగించేందుకు ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేశామన్నారు. యాప్ అభివృద్ధికి సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేశామన్నారు. యాప్ ద్వారా సైకిల్‌ను తీసుకోవడం, రైడ్ పూర్తి చేసిన తర్వాత మరో స్టేషన్‌లో తిరిగి అప్పగించడం, ఆన్‌లైన్‌లో చార్జీలు చెల్లించడం వంటి సదుపాయాలు ఉన్నాయి. స్మాం ట్‌బైక్‌పై ప్రయాణించే సమయంలో ఎన్ని ఎత్తుపల్లాలు దాటారు, ఎంత దూరం ప్రయాణించారు, ఎన్ని క్యాలరీలు ఖర్చయ్యాయి వంటి వివరాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఒక స్టేషన్‌లో సైకిల్ తీసుకుని మరో స్టేషన్‌లో తిరిగి ఇచ్చే విధానం వల్ల ప్రజలకు సౌకర్యవంతమైన ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కల్పించవచ్చని పాలసీ ముసాయిదా కూడా సూచిస్తోంది. ప్రస్తుతం ఆధ్యాత్మిక నగరమైన వారణాసిలో స్మార్ట్‌బైక్ పబ్లిక్ బైక్ షేరింగ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని మనోహర్ తెలిపారు. టెండర్లు గెలుచుకుని అక్కడ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. తదుపరి విశాఖపట్నంలోనూ ఈ వ్యవస్థను అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ విస్తరణతో తమ సంస్థ దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ బైక్ షేరింగ్ కంపెనీగా గుర్తింపు పొందిందని చెప్పారు. దేశంలోని 100 స్మార్ట్ సిటీల్లో చండీగఢ్ పబ్లిక్ బైక్ షేరింగ్ ప్రాజెక్ట్‌ను అత్యుత్తమ ప్రాజెక్ట్‌గా గుర్తించి అవార్డు లభించిందని మనోహర్ తెలిపారు. స్టార్టప్ ఇండియా, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో లభించిన అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మనోహర్ అందుకున్నారు. ఇది స్మార్ట్ మొబిలిటీ రంగంలో తమ ప్రయాణానికి మరో కీలక గుర్తింపుగా ఆయన అభివర్ణించారు.










## ప్రధాని ముందుకు జాతీయ సైక్లింగ్ విధానం

స్టార్టప్ రంగానికి చెందిన వివిధ రంగాల ప్రతినిధులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడిన కార్యక్రమంలో స్మార్ట్ అండ్ సస్టైనబుల్ మొబిలిటీ రంగం నుంచి స్మార్ట్‌బైక్‌కు అవకాశం లభించిందని మనోహర్ తెలిపారు. ఆ అవకాశంతో తనయుడు ధర్మిన్ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆ సమయంలో జాతీయ సైక్లింగ్ పాలసీ, ప్రత్యేక సైక్లింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ మౌలిక వసతులు, సైక్లింగ్ ప్రోత్సాహకాలు అవసరమని ప్రధాని దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆ రోజే, జాతీయ సైక్లింగ్ పాలసీ తీసుకువస్తామని ప్రధాని చెప్పారని ఆయన గుర్తుచేశారు. జాతీయ సైక్లింగ్ పాలసీపై జాప్యం జరుగుతుండటంతో కేంద్రంతో ఫాలో అప్ చేశానని మనోహర్ తెలిపారు. తనకు ఉన్న అనుభవం, సైక్లింగ్ రంగంపై అవగాహన దృష్ట్యా తననే పాలసీని రూపొందించాలని మంత్రిత్వ శాఖ సూచనలు చేసిందన్నారు. దాంతో నేషనల్ సైక్లింగ్ పాలసీ డ్రాఫ్ట్‌తో పాటు ప్రధానమంత్రి స్థాయిలో వివరించేందుకు ప్రత్యేక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించానన్నారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మనోహర్ ప్రతిపాదించిన విధానంలో 2030 నాటికి తక్కువ దూర ప్రయాణాలకు సైకిల్‌ను సహజ ఎంపికగా మార్చడం, రవాణాలో సైక్లింగ్ వాటాను 25 శాతానికి పెంచడం వంటి లక్ష్యాలు ఉన్నాయి. కాలుష్యం తగ్గింపు, రహదారి భద్రత, ఆరోగ్యం, సమానత్వం, స్థిరమైన రవాణా వంటి అంశాలను ఇందులో కలిపారు. దేశవ్యాప్తంగా ప్రత్యేక సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని మనోహర్ ప్రతిపాదించారు. ట్రాఫిక్ నుంచి సైక్లిస్టులను రక్షించేలా బారికేడ్లతో ట్రాక్‌లు ఉండాలని సూచించారు. మాల్స్, హోటళ్లు, థియేటర్లు, కార్యాలయాలు, షాపింగ్ ప్రాంతాలు వంటి అన్ని చోట్ల ప్రత్యేక సైకిల్ పార్కింగ్ తప్పనిసరి చేయాలని కోరారు. ప్రతి ఆదివారాన్ని 'సైక్లింగ్ సండే'గా నిర్వహించి ప్రజలను సైక్లింగ్ వైపు మళ్లించాలని కూడా ప్రతిపాదించారు.

### పాఠశాల నుంచే సైక్లింగ్ అలవాటు

పాఠశాలలు, కళాశాలల నుంచే సైక్లింగ్ సంస్కృతిని పెంచాలని ఆయన ప్రతిపాదించారు. విద్యార్థులు సైకిళ్లపై విద్యాసంస్థలకు వెళ్లేలా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. సైక్లింగ్‌కు విద్యార్థులకు క్రెడిట్లు ఇవ్వాలి. సురక్షిత సైక్లింగ్ మార్గాలు, పార్కింగ్, సైకిల్ నైపుణ్యం, రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సైక్లింగ్ మౌలిక వసతుల కోసం కార్పొరేట్ సంస్థల సీఎస్ఆర్ నిధుల్లో 10 శాతం వినియోగించాలని ముసాయిదా ప్రతిపాదించింది. సైక్లింగ్‌కు సంస్థలు చేసే ఖర్చును వ్యాపార వ్యయంగా పరిగణించి పన్ను ప్రయోజనాలు కల్పించాలని సూచించింది. సైకిల్ టు వర్క్ కార్యక్రమాల్లో ఉద్యోగులకు సైకిల్ అలవెన్సులు, వడ్డీలేని రుణాలు, నగదు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతిపాదించింది. మనోహర్ దృష్టిలో సైక్లింగ్ అనేది కేవలం ఆరోగ్య కార్యక్రమం కాదు. నగరాల్లో పెరుగుతున్న వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి ఇది కీలకమైన పరిష్కారాల్లో ఒకటి. 2023 నాటికి దేశంలో 37.67 కోట్ల వాహనాలు ఉండగా, ఏటా మరో రెండు కోట్లకు పైగా వాహనాలు చేరుతున్నాయని ఆయన పాలసీ ముసాయిదా పేర్కొంది. తక్కువ దూరాలకు సైక్లింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా వాహన కాలుష్యాన్ని తగ్గించవచ్చని అందులో స్పష్టం చేశారు.

### కోవిడ్‌ను మించిన భూతం వాయు కాలుష్యం

కోవిడ్ సమయంలో రెండేళ్లలో సుమారు ఐదు లక్షల మంది ప్రాణాలు కోల్పోతే.. ప్రపంచం మొత్తం తీవ్రంగా స్పందించిందంటారు డీవీ మనోహర్. ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాయని, మనకు అంతగా కనిపించని వాయు కాలుష్యం కారణంగా, ఏటా 22 లక్షల మంది మరణిస్తున్నా, కోవిడ్ సమయంలో చూపించిన స్థాయి శ్రద్ధ, ముందస్తు హెచ్చరికలు కనిపించడం లేదంటారాయన. ఈ పరిస్థితిని మార్చాలని.. పౌరుల ఆయుర్దాయం తగ్గకుండా చూడాలన్నది ఆయన ఉద్దేశం. కాలుష్యం కారణంగా ప్రాణాలు కోల్పోతున్న లక్షలాది మందిని కాపాడాలని... ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లానంటారు డీవీ మనోహర్. ప్రజల ప్రాణాలు కాపాడాలన్న సంకల్పంతో.. పర్యావరణ పరిరక్షణను తన జీవిత లక్ష్యంగా భావిస్తున్నానన్నారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ తరాల భద్రత కోసం కాలుష్య నియంత్రణపై ప్రభుత్వాలు, సమాజం మరింత బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. పట్టణ ప్రజల ఆయుర్దాయం తగ్గకుండా చూడటం, కాలుష్యం కారణంగా ప్రాణనష్టం తగ్గించడం తన జీవిత మిషన్‌గా పెట్టుకున్నానని స్పష్టం చేశారు.

### పిల్లల కోసం పీడియాట్రిక్ ఐసీయూలు

తన వ్యాపార ప్రస్థానంలో సంపాదన ఒక్కటే లక్ష్యం కాదని మనోహర్ చెబుతారు. తనకు సరిపడేంత ఆదాయం వస్తే చాలనేది తన ఆలోచన అని, మిగిలిన సామర్థ్యాన్ని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పెట్టాలని భావిస్తానని తెలిపారు. వ్యాపారంలో తనతో కలిసి పనిచేసిన కొందరు వందల, వేల కోట్ల సంపద సంపాదించినా, తనకు మాత్రం సామాజిక సేవకు ప్రాధాన్యం ఇవ్వడమే ముఖ్యమన్నారు. కోవిడ్ సమయంలో ఎలాంటి ప్రచారం లేకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు నగరాలు, పట్టణాల్లో పేదలకు నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమాలు చేపట్టామన్నారు మనోహర్. స్థానికంగా నమ్మకమైన వ్యక్తులను గుర్తించి వారికి నిధులు అందించడం ద్వారా అవసరమైన కుటుంబాలకు సరుకులు చేరేలా చేశామని చెప్పారు. సేవను ప్రచారంగా కాకుండా బాధ్యతగా చూడటం తమ కుటుంబ విధానమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు దొంతంశెట్టి అప్పారావు, త్రినాథవేణి పేరుతో ఏర్పాటు చేసిన వేణురావు ఫౌండేషన్ ద్వారా పది నగరాలు, పట్టణాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీడియాట్రిక్ ఐసీయూలను ఏర్పాటు చేశామని మనోహర్ తెలిపారు. పెద్దలకు ఐసీయూలు అందుబాటులో ఉన్నా, చిన్నపిల్లలకు అలాంటి సదుపాయాలు తక్కువగా ఉండటాన్ని గమనించి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కోవిడ్ సమయంలో పిల్లలకు అత్యవసర చికిత్స అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఈ సదుపాయాలను ఏర్పాటు చేశామని వివరించారు.

### ఎల్‌వీ ప్రసాద్ సంస్థకు సహకారం

రాజమండ్రిలో పేదలకు సేవలందిస్తున్న కంటి ఆసుపత్రికి మొబైల్ ఐ క్లినిక్‌ల కోసం బస్సులను సమకూర్చినట్లు తెలిపారు. ఈ బస్సుల ద్వారా మారుమూల గ్రామాలు, పట్టణాలకు వెళ్లి కంటి పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆసుపత్రి కొత్త కాంప్లెక్స్, ఆపరేషన్ థియేటర్ నిర్మాణానికి కూడా సహకరించినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన కొత్త కాంప్లెక్స్‌లో ఆపరేషన్ థియేటర్‌కు తమ కుటుంబం తరఫున సహకారం అందించామని మనోహర్ తెలిపారు. తల్లిదండ్రుల పేరుతో ఆ ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సేవా కార్యక్రమాలన్నింటిలోనూ ప్రచారం పొందాలనే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. 1975లో చిన్న పరిశ్రమతో ప్రారంభమైన డీవీ మనోహర్ వ్యాపార ప్రయాణం ఎల్పీజీ, హోటళ్లు, స్మార్ట్ మొబిలిటీ వరకు సాగింది. వ్యక్తిగత అనుభవంతో సైక్లింగ్‌ను స్వీకరించి, అక్కడి నుంచి అంతర్జాతీయ సైక్లింగ్ రంగంలో నాయకత్వ స్థానానికి ఎదిగారు. ఆ అనుభవాన్ని తిరిగి భారతదేశానికి తీసుకువచ్చి పబ్లిక్ బైక్ షేరింగ్, స్మార్ట్‌బైక్, జాతీయ సైక్లింగ్ పాలసీ వంటి ఆలోచనలకు రూపం ఇచ్చారు. ఇప్పుడు ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణను తన జీవిత ధ్యేయంగా భావించి పనిచేస్తున్నానని ఆయన చెబుతున్నారు. అదే ఆయన వ్యాపార ప్రస్థానానికి సామాజిక అర్థాన్ని ఇచ్చిన అసలు కథ.





# డీవీ మనోహర్ హిస్టరీ... అసామాన్య విక్టరీ

### రోడ్లపై సైక్లిస్టులకు ప్రాధాన్యం

సైక్లిస్టులకు రోడ్లపై 'ఫస్ట్ రైట్ ఆఫ్ వే' కల్పించాలని ముసాయిదా ప్రతిపాదించింది. వాహనదారులు సైక్లిస్టుల హక్కును గౌరవించేలా నిబంధనలు రూపొందించాలి. కీలక కూడళ్లలో ప్రత్యేక సైకిల్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. రాత్రివేళ సైకిళ్లకు ముందు, వెనుక లైట్లు ఉండేలా చూడాలి. సైక్లిస్టుల భద్రత కోసం హెల్మెట్ వినియోగం, రహదారి భద్రతపై అవగాహనకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### జీఎస్టీ తగ్గింపు.. పన్ను ప్రోత్సాహకాలు

సైక్లింగ్‌ను సామాన్యులకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి సాధారణ సైకిళ్లపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. ఎలక్ట్రిక్ సైకిళ్లకు పన్ను, దిగుమతి సుంకాల్లో రాయితీలు కల్పించాలని సూచించారు. సైకిల్ కొనుగోలు, అద్దెకు తీసుకునే వారికి అదనపు పన్ను ప్రయోజనాలు ఇవ్వడంతో పాటు సైక్లింగ్ రంగంలో పెట్టుబడులకు ప్రోత్సాహకాలు కల్పించాలి.

### కార్పొరేట్ల సీఎస్ఆర్లో సైక్లింగ్‌కు 10%

ప్రతి కార్పొరేట్ సంస్థ తన సీఎస్ఆర్ నిధుల్లో 10 శాతాన్ని సైక్లింగ్ ప్రోత్సాహం, మౌలిక వసతుల ఏర్పాటుకు వినియోగించాలని ముసాయిదా సూచించింది. సైక్లింగ్ కోసం వ్యాపార సంస్థలు చేసే ఖర్చును పన్ను మినహాయింపుకు అర్హమైన వ్యయంగా పరిగణించాలి. ఉద్యోగులను సైకిల్ టు వర్క్ విధానంలో ప్రోత్సహించేందుకు సైకిల్ అలవెన్సులు, వడ్డీలేని రుణాలు, నగదు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

### పాఠశాల నుంచే సైక్లింగ్ సంస్కృతి

సైక్లింగ్‌ను పాఠశాలలు, కళాశాలల నుంచే జీవనశైలిలో భాగం చేయాలని డీవీ మనోహర్ ప్రతిపాదించారు. విద్యార్థులు సైకిళ్లపై విద్యాసంస్థలకు వెళ్లేలా ప్రోత్సహించాలి. సైక్లింగ్‌కు విద్యార్థులకు క్రెడిట్లు ఇవ్వాలి. సురక్షిత మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు సైకిల్ నైపుణ్యం, రహదారి భద్రతపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. బాలికల సాధికారతలోనూ సైక్లింగ్‌ను ఉపయోగించాలి.

### ప్రత్యేక మంత్రిత్వ శాఖ.. జాతీయ టాస్క్‌ఫోర్స్

సైక్లింగ్ విధానాన్ని దేశవ్యాప్తంగా సమర్థంగా అమలు చేసేందుకు 'మినిస్ట్రీ ఆఫ్ స్మార్ట్ అండ్ సస్టైనబుల్ మొబిలిటీ' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దాని కింద నేషనల్ సైక్లింగ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి మౌలిక వసతులు, అవగాహన, ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షించాలి. స్వచ్ఛ భారత్ తరహాలో మిషన్ మోడ్‌లో సైక్లింగ్ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

## కేంద్రానికి మనోహర్.. సైక్లింగ్ జాతీయ విధానం ప్రతిపాదనలు

### 2030 నాటికి సైకిల్‌దే 25% వాటా

**2030 నాటికి తక్కువ దూర ప్రయాణాలకు సైకిల్‌ను సహజ ఎంపికగా మార్చాలి. దేశ రవాణాలో సైక్లింగ్ వాటాను 25 శాతానికి పెంచాలి. కార్బన్ ఉద్గారాల తగ్గింపు, 2070 నెట్‌జీరో లక్ష్యానికి సైక్లింగ్‌ను కీలక సాధనంగా మార్చాలి.**

### వాహన కాలుష్యానికి సైక్లింగ్‌తో చెక్

**భారత్‌లో 2023 నాటికి 37.67 కోట్ల వాహనాలు ఉండగా, ఏటా మరో రెండు కోట్లకు పైగా వాహనాలు చేరుతున్నాయి. పెరుగుతున్న వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు తక్కువ దూరాలకు సైక్లింగ్‌ను ప్రోత్సహించాలి. సైక్లింగ్ వల్ల గాలి నాణ్యత మెరుగుపడటంతో పాటు ప్రజల ఆరోగ్యం, నగరాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.**

### ప్రత్యేక ట్రాక్‌లు.. సైక్లిస్టులకు భద్రత

సైక్లిస్టులకు భద్రత కల్పించేందుకు మోటారు వాహనాల నుంచి వేరుగా బారికేడ్లతో ప్రత్యేక సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని నివేదిక ప్రతిపాదించింది. వన్‌వే మార్గానికి కనీసం 1.5 మీటర్లు, రెండు వైపుల ప్రయాణానికి 2.5 మీటర్ల వెడల్పు ఉండాలి. నగరాల మధ్య సైకిల్ హైవేలు ఏర్పాటు చేసి, రద్దీ ప్రాంతాల నుంచి శివారు, గ్రామీణ ప్రాంతాలకు నెట్‌వర్క్‌ను విస్తరించాలి.

### 100 స్మార్ట్ సిటీల్లో బైక్ షేరింగ్

దేశంలోని 100 స్మార్ట్ సిటీల్లో పబ్లిక్ బైక్ షేరింగ్ వ్యవస్థలను తప్పనిసరిగా అమలు చేసి, తర్వాత పట్టణాలకు విస్తరించాలని ముసాయిదా సూచించింది. మెట్రో, బస్‌స్టేషన్ల వద్ద సైకిళ్లు అందుబాటులో ఉంచి ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కల్పించాలి. తక్కువ అద్దెతో సేవలు అందిస్తూ, బైక్ స్టేషన్ల ప్రకటనల ద్వారా నిర్వహణకు ఆదాయం కల్పించాలనే ప్రతిపాదన ఉంది.

### ప్రతి చోట సైకిల్ పార్కింగ్.. ఆదివారం సైక్లింగ్

మాల్స్, హోటళ్లు, థియేటర్లు, కార్యాలయాలు, షాపింగ్ ప్రాంతాలు సహా అన్ని పార్కింగ్ ప్రదేశాల్లో ప్రత్యేక సైకిల్ పార్కింగ్ తప్పనిసరి చేయాలని ప్రతిపాదించారు. మెట్రో, బస్‌స్టేషన్ల వద్ద సురక్షిత పార్కింగ్ ఏర్పాటు చేయాలి. దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారాన్ని 'సైక్లింగ్ సండే'గా నిర్వహించి, రద్దీ ప్రాంతాలను కార్‌ఫ్రీ జోన్లుగా మార్చి సైక్లింగ్‌ను ప్రోత్సహించాలని సూచించారు.











## మెట్రోలో శ్రీనాథ్.. వైరల్‌గా మారిన సింప్లిసిటీ

### విలాసం వద్దు.. సాధారణ ప్రయాణమే ముద్దు

మాజీ భారత ఫాస్ట్‌బౌలర్, ప్రస్తుతం ఐసీసీ మ్యాచ్ రిఫరీగా వ్యవహరిస్తున్న జవగళ్ శ్రీనాథ్ సాధారణ జీవనశైలితో క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించారు. విలాసవంతమైన వాహనాన్ని కాకుండా మెట్రోలో ప్రయాణించిన శ్రీనాథ్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చేతిలో ట్రాలీ బ్యాగ్ పట్టుకుని మెట్రో కోచ్‌లో ఓ మూలన నిల్చున్న ఆయనను చూసిన అభిమానులు సింప్లిసిటీకి ప్రశంసలు కురిపిస్తున్నారు. 1991 నుంచి 2002 వరకు భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన శ్రీనాథ్ 67 టెస్టుల్లో 236 వికెట్లు, 229 వన్డేల్లో 315 వికెట్లు పడగొట్టారు. మొత్తం 296 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 551 వికెట్లతో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఏడో స్థానంలో ఉన్నారు. భారత పేసర్లలో వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన రికార్డు కూడా ఆయనదే. ఇదిలా ఉండగా టెస్టు క్రికెట్‌ను 'క్రికెట్ మొత్తానికి తల్లి'గా అభివర్ణించిన శ్రీనాథ్, యువ ఆటగాళ్లు సుదీర్ఘ ఫార్మాట్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఐపీఎల్ ముఖ్యమే అయినా టెస్టుల్లో నైపుణ్యం సాధిస్తే టీ20ల్లో రాణించడం సులభమని అన్నారు.

## 15 ఏళ్లకే కెప్టెన్సీ

### వైభవ్ సూర్యవంశీ చరిత్ర

### దులీప్ ట్రోఫీలో గోల్డెన్ ఛాన్స్

భారత దేశవాళీ క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో చరిత్రాత్మక ఘనత సాధించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. బెంగళూరులో సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్‌లో రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడటంతో ఈ అవకాశం వైభవ్‌ను వరించింది. సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో వికెట్ కీపింగ్ చేస్తున్న ఇషాన్ కిషన్ కుడి మణికట్టుకు బంతి బలంగా తగిలింది. ఫిజియోల చికిత్స అనంతరం అతడు మైదానం వీడగా, కుమార్ కుషాగ్ర వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడు. అనంతరం వైస్ కెప్టెన్‌గా ఉన్న వైభవ్‌కు కెప్టెన్సీ అప్పగించారు. దీంతో ఇంత చిన్న వయసులో సీనియర్ ఫస్ట్‌క్లాస్ జట్టుకు నాయకత్వం వహించిన అరుదైన ఆటగాడిగా వైభవ్ చరిత్రలో నిలిచాడు.

### సీనియర్ల మధ్య నాయకత్వం

టోర్నీకి ముందే వైభవ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే దీర్ఘకాలికంగా అతడిని నాయకత్వానికి సిద్ధం చేయాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈస్ట్ జోన్ సెలెక్టర్లు స్పష్టం చేశారు. 2024 ఆరంభంలో ఫస్ట్‌క్లాస్ అరంగేట్రం చేసిన వైభవ్ ప్రస్తుతం తన పదో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడుతున్నాడు. దులీప్ ట్రోఫీలో ఇది అతడికి రెండో మ్యాచ్ మాత్రమే. అయినా మహ్మద్ షమీ, ముకేశ్ కుమార్, అభిమన్యు ఈశ్వరన్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన జట్టును నడిపించే బాధ్యత అతడి భుజాలపై పడింది. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈస్ట్ జోన్ బౌలింగ్ వ్యూహాలను సమర్థంగా నిర్వహిస్తూ సెంట్రల్ జోన్‌ను లంచ్ సమయానికి 81/3కు పరిమితం చేశాడు. ఇషాన్ కిషన్ గాయం, మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా.. వైభవ్ కెరీర్‌లో ఇది చిరస్మరణీయ మైలురాయిగా నిలిచింది.







## బీసీసీఐకి అనయ బంగర్ వరల్డ్‌కప్ సందేశం

**ఐదు నెలలు డ్రెస్సింగ్ రూమ్‌లోనే జీవితం**

మాజీ భారత క్రికెటర్, కోచ్ సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్ తన క్రికెట్ కలను తిరిగి సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయంతో మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఎంపికకు అర్హత పొందే మార్గం ఆమెకు తెరుచుకుంది. అయితే ఈ స్థాయికి చేరుకోవడం వెనుక తన ప్రయాణం ఎంతో కఠినంగా సాగిందని అనయ వెల్లడించారు. లింగ మార్పు ప్రక్రియకు ముందు, తర్వాత ఎదురైన సామాజిక వ్యతిరేకత, కుటుంబం నుంచి లభించిన పరిమిత మద్దతు తనను తీవ్రంగా ప్రభావితం చేశాయని తెలిపారు. యూకేలో ఒక దశలో దాదాపు ఐదు నెలల పాటు క్రికెట్ డ్రెస్సింగ్ రూమ్‌లలోనే ఉంటూ జీవనం సాగించానని, ఆ పరిస్థితుల నుంచి బయటపడేందుకు సోషల్ మీడియాలోకి వచ్చి బ్రాండ్ డీల్స్ ద్వారా తనకు అవసరమైన శస్త్రచికిత్సలు, ఇతర ప్రక్రియలకు నిధులు సమకూర్చుకున్నానని చెప్పారు. ప్రస్తుతం కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న అనయ.. భారత మహిళా క్రికెట్‌లో తనలాంటి క్రీడాకారులకు అవకాశాలు కల్పించేలా బీసీసీఐ సమగ్రమైన, న్యాయమైన విధానాలు రూపొందించాలని కోరారు. భవిష్యత్తులో భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడమే తన అతిపెద్ద కల అని స్పష్టం చేశారు.

## డ్రాప్ చేసినా.. సామ్‌సన్ స్పందనకు సూర్య ఫిదా

### ప్రపంచకప్ కోసం ఏదైనా చేస్తానన్న సామ్‌సన్

టీ20 ప్రపంచకప్ 2026కు ముందు పేలవ ఫామ్‌తో భారత తుది జట్టు నుంచి తప్పించిన సంజూ సామ్‌సన్.. చివరకు టోర్నీలో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన తీరు అందరినీ ఆకట్టుకుంది. తాజాగా మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. సామ్‌సన్‌ను జట్టు నుంచి తప్పించే నిర్ణయం చెప్పిన సమయంలో అతడి స్పందనను వెల్లడించారు. న్యూజిలాండ్‌తో ప్రపంచకప్‌కు ముందు జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో సామ్‌సన్ ఆశించిన స్థాయిలో పరుగులు చేయకపోవడంతో ఇషాన్ కిషన్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో ఈ విషయాన్ని సామ్‌సన్‌కు చెప్పగా.. "ప్రపంచకప్ గెలిచేందుకు జట్టుకు ఏది సరైందని అనుకుంటే అది చేయండి. నాకు ఎప్పుడు అవసరం వచ్చినా నేను



అందుబాటులో ఉంటాను. ఆడుతున్నట్టుగానే సిద్ధమవుతాను" అని చెప్పాడని సూర్య తెలిపారు. ఆ మాటలు తనకు ఎంతో నమ్మకాన్ని ఇచ్చాయని, "జీవితంలో ఇలాంటి వాళ్లు కూడా ఉంటారా" అంటూ ఆశ్చర్యపోయానని చెప్పారు. గతంలో సామ్‌సన్‌పై తనకు ఉన్న నమ్మకాన్ని కూడా సూర్య గుర్తుచేశారు. సూపర్-8లో తిరిగి తుది జట్టులోకి వచ్చిన సామ్‌సన్ వెస్టిండీస్‌పై 97లి పరుగులు చేసి, సెమీఫైనల్, ఫైనల్లో 89 చొప్పున స్కోర్లు సాధించి భారత్ ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.



## టాక్సిక్ నష్టాలు.. దిల్‌రాజుకు భారీ లాభం?

### 'రామాయణం' హక్కులతో రిస్క్ రివర్స్?

యశ్ నటించిన 'టాక్సిక్' సినిమా తెలుగు రాష్ట్రాల్లో ఓపెనింగ్ డే తర్వాత ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించకపోవడం నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్‌రాజుకు ఇబ్బందిగా మారినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ద్వారా దిల్‌రాజు ఏపీ, తెలంగాణ థియేట్రికల్ హక్కులను భారీ మొత్తానికి కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే 'టాక్సిక్'తో నష్టాలు ఎదురైతే వాటిని పూడ్చేందుకు యశ్ ముందుకొచ్చే అవకాశం ఉందన్న ప్రచారం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇందులో భాగంగా ఒకవైపు నష్టాలను యశ్ భర్తీ చేయవచ్చని, మరోవైపు ఆయన తదుపరి ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం' ఏపీ, తెలంగాణ థియేట్రికల్ హక్కులను దిల్‌రాజుకు అప్పగించే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఆసక్తికరంగా దిల్‌రాజు ఇప్పటికే 'రామాయణం' తెలుగు రాష్ట్రాల హక్కుల కోసం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ డీల్ ఖరారైతే 'టాక్సిక్'తో ఎదురైన రిస్క్‌ను భర్తీ చేసుకోవడంతో పాటు దిల్‌రాజుకు భారీ లాభదాయక అవకాశంగా మారొచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

## ఇరుముడి రికార్డు.. 24 గంటల్లోనే సంచలనం

### టికెట్ విక్రయాల్లో ఆల్‌టైమ్ ఇండియా రికార్డు




రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' బా క్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. థియేటర్లలో పలు కొత్త చిత్రాల నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నా.. వసూళ్లలో ఏమాత్రం తగ్గకుండా కొత్త రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలోనే అరుదైన ఘనత సాధించినట్లు చిత్రబృందం ప్రక టించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫా మ్‌లలో 24 గంటల వ్యవధిలో అత్యధిక టికెట్లు విక్రయించిన భారతీయ చిత్రంగా 'ఇరుముడి' రికార్డు నెలకొల్పిం ది. అయితే ఎన్ని టికెట్లు అమ్ముడ య్యాయన్న ఖచ్చితమైన సంఖ్యను మేకర్స్ వెల్లడించలేదు. ఈ రికార్డు సినిమాకు ఉన్న భారీ డిమాండ్‌ను స్పష్టం చేస్తోంది. మరో వైపు ఆదివారం బుక్‌మైషోలో గంటకు 22 వేలకు పైగా టికెట్లు అమ్ముడవు తుండటం వసూళ్లపై అంచనాలను పెంచుతోంది. ఇదే జోరు కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా రూ. 200 కోట్ల గ్రాస్ మార్క్‌ను సినిమా త్వరలోనే అందుకునే అవకాశం ఉంది.

## బాక్సాఫీస్ అద్భుతం

### 'హనుమాన్ అంష్' సంచలన వసూళ్లు

### మూడో వారంలో ఏకంగా 2150% వృద్ధి



హిందీ భక్తిరస చిత్రాల్లో అరుదైన బాక్సాఫీస్ అద్భుతాన్ని 'హనుమాన్ అంష్' నమోదు చేస్తోంది. తొలి రెండు వారాల్లో కేవలం రూ. 1.5 కోట్ల నెట్ వసూళ్లు మాత్రమే సాధించిన ఈ చిత్రం.. మూడో వారంలో ఏకంగా రూ. 10 కోట్ల నెట్ వసూళ్లు రాబట్టి సంచలనం సృష్టించింది. రెండో వారంతో పోలిస్తే మూడో వారంలో ఏకంగా 2150 శాతం వృద్ధి సాధించడం విశేషం. పాజిటివ్ టాక్ ఉన్నప్పటికీ కొత్త సినిమాల రాకతో మొదట్లో ఈ చిత్రానికి థియేటర్లు, స్క్రీన్లు తగ్గిపోయాయి. అయితే ప్రేక్షకుల ఆదరణ కొనసాగడంతో మూడో వారంలో షోలు, స్క్రీన్లు తిరిగి పెరిగాయి. నాలుగో వారం శుక్రవారం సుమారు రూ. 6 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు అంచనా. నాలుగో వారాంతానికి మొత్తం రూ. 24 కోట్ల నెట్ వసూళ్లు వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఓటీటీ విడుదలకు ఎక్కువ సమయం ఉండే హిందీ చిత్ర పరిశ్రమలో మంచి కంటెంట్ ఉంటే ఆలస్యంగానైనా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించవచ్చని 'హనుమాన్ అంష్' నిరూపిస్తోంది. విశాల్ చతుర్వేది రచించి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో చందన్ ఆనంద్, శోభినవ్ సత్య ప్రధాన పాత్రల్లో నటించారు.




## 'విశ్వనాథ్ అండ్ సన్స్'కు రూ.240 కోట్ల మైలురాయి

### 15 రోజుల్లోనూ కొనసాగుతున్న వసూళ్ల జోరు

సూర్య ప్రధాన పాత్రలో వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ డ్రామా 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద స్థిరమైన వసూళ్లతో దూసుకెళ్తోంది. వరుసగా కొత్త సినిమాలు థియేటర్లలోకి వస్తూ గట్టి పోటీ ఇస్తున్నా.. ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. ఇప్పటికే విడుదలై 15 రోజులు పూర్తిచేసుకున్న ఈ సినిమా తాజాగా ప్రపంచవ్యాప్తంగా రూ. 240 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని దాటినట్లు చిత్రబృందం ప్రకటించింది. పోటీ సినిమాల ప్రభావాన్ని తట్టుకుని థియేటర్లలో తన స్థానాన్ని నిలబెట్టుకోవడం చిత్రానికి కలిసొచ్చిన అంశంగా మారింది. నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్య భారీ స్థాయిలో నిర్మించిన ఈ చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో కూడిన కథకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండగా.. హీరోయిన్ మమితా బైజు తన నటనతో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం మూడో వారాంతంలోకి అడుగుపెడుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఇదే జోరును కొనసాగిస్తే ప్రపంచవ్యాప్తంగా మరింత భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.